వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 155

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 28 జూన్ 2026







**సమయం ప్రతినిధి:** హోం మంత్రి అమిత్ షా గుజరాత్‌లో తాజాగా భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించారు. కోపరేటివ్ మోడల్‌లో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండే ఈ యాప్ ప్రారంభ వేడుకల్లో హోం మంత్రి ప్రసంగిస్తూ ట్యాక్సీ సేవలు ప్రస్తుతం నిత్యావసరంగా మారాయని అన్నారు. ఇటీవల కాలంలో ఈ రంగం గణనీయంగా విస్తరించిందని అన్నారు. ప్రస్తుతం ద్విచక్రవాహనాలు కూడా బైక్ ట్యాక్సీలుగా కుంభమేళా లాంటి భారీ ఈవెంట్స్‌లో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రెండేళ్లల్లో 500 నగరాలకు ఈ ట్యాక్సీ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేటు రైడ్ హెయిలింగ్ యాప్స్‌పై కూడా విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ యాప్‌లు ఒక క్రమపద్ధతితో శ్రమదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రవాణా ఆపరేటర్లను డ్రైవర్లుగా పిలవడం కంటే సారథులని పిలుస్తానని చెప్పారు. ప్రైవేటు ఆపరేటర్లే అధిక శాతం లాభాలు దండుకుని వర్కర్లను వేధించిన ఘటనలు ఉన్నాయని అన్నారు. భారత్ ట్యాక్సీలో ఇలాంటి శ్రమదోపిడీ ఉండదని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఒక న్యాయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అన్నారు. వినియోగదారులు, డ్రైవర్లకు ఎలాంటి నష్టం చేకూర్చని వ్యవస్థ ఇదేనని అన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని అన్నారు. సుస్థిర ఆర్థిక భద్రతను సొంతం చేసుకున్నారని అన్నారు. భారత్ ట్యాక్సీలో రేట్లు ఎక్కువగా ఉన్నాయన్న వాదనలను కూడా హోం మంత్రి కొట్టిపారేశారు. ప్రత్యర్థి యాప్‌లు కావాలనే వ్యూహాత్మకంగా తమ ధరలను తగ్గిస్తున్నాయని కూడా హోం మంత్రి ఆరోపించారు.




**సమయం ప్రతినిధి:** నాలుగు తరాలుగా కొనసాగుతున్న ఒక భూవివాదానికి సుప్రీం కోర్టు తాజాగా ఫుల్ స్టాప్ పెట్టింది. భూమికి సంబంధించిన 1957 నాటి సేల్ డీడ్ చట్టబద్ధమేనంటూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిన్ ఎన్.వి అంజరియాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పడింది.

**ఏమిటీ వివాదం..** ఈ కేసులో అప్పీలు చేసుకున్న సరాఫత్ అలీ పూర్వీకులు 1957లో హరిద్వార్ (ఉత్తరాఖండ్) కొంత భూమిని కొనుగోలు చేశారు. అప్పటికి సరాఫత్ అలీ మైనర్. నాటి నుంచీ ఆ భూమి సరాఫత్ అలీ కుటుంబం ఆధీనంలోనే ఉంది. భూమిని సరాఫత్ పూర్వీకులకు అమ్మిన కొందరు అభ్యంతరం చెప్పడంతో సేల్ డీడ్ జరిగినా మ్యూటేషన్ మాత్రం నిలిచిపోయింది. 1984లో వారు తమ అభ్యంతరాలను వెనక్కు తీసుకోవడంతో మ్యూటేషన్ కూడా పూర్తయ్యింది. అయితే, 1991లో ప్రభుత్వం భూమి ఏకీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలో తనను భూమిదారుగా గుర్తించాలని సరాఫత్ దరఖాస్తు చేసుకున్నారు. 1993లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ హక్కులను గుర్తించారు. అయితే, సరాఫత్ భూమిపై కో టెన్యూర్ హక్కులున్న మరికొందరు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో 1999లో కన్సాలిడేషన్ అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు.




**సమయం ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు (శనివారం) నుంచి మూడు రోజుల పాటు సీషెల్స్ దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. సీషెల్స్ జాతీయ దినోత్సవంలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది స్వర్ణోత్సవ వేడుకలు జరగడంతో ఈ పర్యటన మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు.సీషెల్స్ భారతదేశానికి అత్యంత విలువైన సముద్ర సరిహద్దు పొరుగు దేశమని, భారతదేశం చేపట్టిన 'మహాసాగర్ విజన్'లోనూ, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలోనూ కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, సముద్ర భద్రతా సహకార అంశాలపై వీరు చర్చించే అవకాశం ఉంది. అలాగే సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడం గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. సీషెల్స్‌లో నివసిస్తున్న భారతీయ సమాజ ప్రతినిధులను కలుసుకునేందుకు కూడా తాను ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటన భారత్–సీషెల్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు దోహదపడనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీసుస్టేషన్ పరిధిలో హైడ్రా అధికారులు ఈరోజు (శనివారం) భారీ కూల్చివేతలు చేపట్టారు. హస్మత్‌పేట్ ప్రాంతంలోని సర్వే నంబర్–1 చత్రిగడ్డ వద్ద అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు రంగంలోకి దిగారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను గుర్తించిన హైడ్రా బృందం, భారీ యంత్రాల సహాయంతో వాటి తొలగింపు ప్రక్రియను ప్రారంభించింది. కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ సంఖ్యలో పోలీసులు, డీఆర్ఎఫ్, ఎస్ఓటీ సిబ్బందిని మోహరించారు. నాలుగు వైపులా భద్రతా వలయం ఏర్పాటు చేసి అధికారులు కూల్చివేతలను కొనసాగిస్తున్నారు. కూల్చివేతల ప్రాంతానికి సాధారణ ప్రజలను, ఇతర వ్యక్తులను అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అన్యాక్రాంతమైన సుమారు 108 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు విక్రయాలు కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ భూకబ్జా వ్యవహారంలో కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. సంబంధిత అంశాలపై విచారణ కొనసాగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాల పరిరక్షణలో భాగంగా అక్రమ ఆక్రమణలపై హైడ్రా కఠిన చర్యలు కొనసాగిస్తోందని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుండగా, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

**దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.**




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ–ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. 'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ–ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## పెండ్లిళ్లలో మిగిలిన ఆహారం నాణ్యత పరిశీలించిన తర్వాతే స్వీకరించాలి

**– జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**(సమయం ప్రతినిధి):** పెండ్లిళ్లు, శుభకార్యాలు, విందు కార్యక్రమాలు, సామూహిక భోజనాల అనంతరం మిగిలిపోయిన ఆహారాన్ని స్వీకరించే ముందు దాని నాణ్యత, తాజాదనం, పరిశుభ్రతను తప్పనిసరిగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రజలకు సూచించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మిగిలిన ఆహారాన్ని అవసరమైన వారికి పంపిణీ చేసే ముందు అది సురక్షితంగా ఉందో లేదో నిర్ధారించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఆహారం తయారైన సమయం, నిల్వ చేసిన విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, రవాణా పరిస్థితులను పరిశీలించిన తర్వాత మాత్రమే పంపిణీ చేసి వినియోగించాలని సూచించారు. ఎక్కువసేపు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచిన ఆహారం కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇలాంటి ఆహారం విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. సేవా కార్యక్రమాల పేరుతో పంపిణీ చేసే ఆహారాన్ని పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసి, సురక్షిత పరిస్థితుల్లో తరలించాలని, ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఆహారం వాసన, రంగు, రుచి లేదా నాణ్యతలో మార్పులు కనిపిస్తే దానిని వినియోగించకుండా పారవేయాలని తెలిపారు. ఆహారం తీసుకున్న అనంతరం వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ప్రజల ఆరోగ్య రక్షణే అత్యంత ముఖ్యమని పేర్కొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రతి ఒక్కరూ ఆహార భద్రతా నిబంధనలు పాటించి సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్నే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శుభకార్యాల నిర్వాహకులు, క్యాటరింగ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పూర్తి బాధ్యతతో వ్యవహరించి ఆహార వ్యర్థాలను తగ్గించడంతో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# దేవరకద్ర నియోజకవర్గంలో ఆర్భాటంగా సాగిన కాంగ్రెస్ ఆదివాసీ బస్సు యాత్ర

**దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ఆధ్వర్యంలో బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికిన ఎస్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు**



**(సమయం ప్రతినిధి దేవరకద్ర) :** ఎరుకలి, యానాది, గిరిజన ఆదివాసీ వర్గాలకు రిజర్వేషన్ ఇచ్చి 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర భూత్పూర్ మున్సిపాలిటీ లో ఘనంగా కొనసాగింది, అనంతరం రాందాస్ తండా చేరుకుని అక్కడ భారీ సభతో ముగియడం జరిగింది.బస్సు యాత్ర భారీ బహిరంగ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..గిరిజన వర్గాల సామాజిక, విద్యా, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. స్వర్గీయ. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కల్పించిన ఎస్టీ రిజర్వేషన్లు గిరిజనుల అభ్యున్నతికి బాటలు వేసాయని, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.తదనంతరం బంజారా ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ కల్పించిన రిజర్వేషన్ల వల్లే బంజారా లు రాజకీయంగా ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకున్నారని తెలియజేశారు.ప్రతి తండాలో కాంగ్రెస్ జెండా, ప్రతి బంజారా ఇంట్లో ఇందిరమ్మ ఫోటో ఉండాలని తెలియజేశారు. ఈ బస్సు యాత్ర లో ఎంపీ బలరాం నాయక్ , ఎమ్మెల్యేలు జాటోత్ రాంచంద్రు నాయక్ ,బాలు నాయక్ , రాందాస్ నాయక్ , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , జాతీయ ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ , మాజీ మంత్రి రవీంద్ర నాయక్ , మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , తెలంగాణ ఎరుకుల సంఘం అధ్యక్షులు కుత్తాడి కుమార్ తదితర ఎస్టీ ప్రజా ప్రతినిధులు విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దలైలామా కోసం 140 కిలోమీటర్లు గుర్రాలపై!

స్వాతంత్ర్య ప్రదాతలు, గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు అయిన మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ, డాక్టర్ అంబేడ్కర్, సర్దార్ పటేల్ మొదలైన మహోన్నతుల జనన, మరణ తేదీలను మనం మరచిపోము. ఆ సందర్భాలలో ఆ మహనీయులను సంస్మరించుకుని స్ఫూర్తి పొందుతున్నాం, నివాళులర్పించి కర్తవ్యోన్ముఖులమవుతున్నాం. ఆ మహానుభావుల వలే ప్రసిద్ధులు కాని, అయితే జాతి నిర్మాణానికి ప్రశస్త సేవలు అందించిన సముదాత్తులకు సంబంధించిన ముఖ్యమైన వార్షికోత్సవాలను విస్మరిస్తున్నాం. భారత రిపబ్లిక్ సంస్థాపక భావాలను తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో సంపూర్ణంగా ప్రతిబింబింపజేసిన ఒక పాలనాదక్షుడి శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. ఆ అనుపమేయ దేశభక్తుడు హర్‌మందర్ సింగ్. నేడు (జూన్ 27) ఆయన శతజయంతి. జాతి నిర్మాణంలో ఒక సాహస ప్రయోగమైన 'ఇండియన్ ఫ్రాంటియర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్' (ఐఎఫ్ఏఎస్)కు చెందిన ప్రముఖ అధికారి. ఒక ప్రత్యేక లక్ష్యం కోసం ఏర్పడి విశిష్ట సేవలు అందించిన సర్వీస్ అది. ప్రస్తుతం ఉనికిలో లేని ఆ సర్వీస్ గురించి ఈ తరం వారికి దాదాపుగా ఏమీ తెలియదనే చెప్పవచ్చు. అయితే ఐఎఫ్ఏఎస్ గురించి ప్రజలకు మరింత మెరుగైన అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది.

ఇండియన్ ఫ్రాంటియర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ గురించి నేను మొట్టమొదట 1990ల తొలినాళ్లలో విన్నాను. మానవశాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ (1902–1964) జీవిత చరిత్ర రచనా కృషిలో నేను తలమునకలై ఉన్న రోజులవి. ఎల్విన్ బ్రిటిష్ జాతీయుడు. మధ్య భారతదేశంలోని ఆదివాసీల మధ్య రెండున్నర దశాబ్దాల పాటు నివసించాడు. ఆ ఆదివాసీల చరిత్ర, సంస్కృతి గురించి విస్తృతంగా రాశాడు. అంతకంటే ముఖ్యంగా వారి సమస్యలపై సమగ్ర అవగాహన ఉన్న మానవశాస్త్ర విజ్ఞాని. స్వాతంత్ర్యానంతరం ఆయన భారత పౌరసత్వాన్ని స్వీకరించారు. 1954లో నార్త్ ఈస్టర్న్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (నీఫా) ఆదివాసీ వ్యవహారాలపై సలహాదారుగా నియమితులయ్యారు (ప్రస్తుత అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రమే నాటి నీఫా). ఐఎఫ్ఏఎస్ అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో మిష్మి ఆదివాసీ విద్యావంతుడు ఒకరు తనకు చెప్పిన మాటలను ఎల్విన్ సదా మనసులో ఉంచుకున్నారు. ఆ మిష్మి గిరిజనుడు ఎల్విన్‌ను ఇలా సూటిగా, స్పష్టంగా హెచ్చరించారు: 'గుర్తుంచుకోండి, సంస్కృతిపరంగా చూసినా, జాతిపరంగా చూసినా మేము భారతీయులం కాబోము. మా సంస్కృతిని, మతాన్ని తక్కువ చూపు చూసే, అసలు మమ్ములను తోటి మనుషులుగా గుర్తించని అధికారులను మా వ్యవహారాల నిర్వహణకు పంపితే కొద్ది సంవత్సరాలలోనే మేము మీకు నిశ్చితంగా వ్యతిరేకులమవుతాము'.

ఐఎఫ్ఏఎస్ అధికారులు తమ విధులను నిర్వహిస్తున్న తీరుతెన్నులను ప్రధాని నెహ్రూ విశేష శ్రద్ధాసక్తులతో పర్యవేక్షిస్తుండేవారు. నెహ్రూ వారికి చెప్పిన మాటలను ఒక అధికారి ఇలా గుర్తుచేసుకున్నారు: 'సిబ్బంది జాతీయ పతాక వెంట వెళ్లాలి. టైప్ రైటర్లు ఆ తరువాత వస్తాయి'. నిగూఢంగా ఉన్న ఈ గంభీరమైన మాటల అర్థం ఇది: 'ప్రజలే ప్రథమం. అధికారిక ప్రభుత్వ వ్యవస్థలను ప్రవేశపెట్టే ముందు పాలనా సిబ్బంది ప్రజల గౌరవాన్ని, స్నేహాన్ని సంపాదించుకోవాలి. స్థానికులతో సత్సంబంధాలను ఏర్పరచుకున్న తరువాతే అధికారిక ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి క్రమబద్ధమైన పాలననందించాలి'. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ అధికారుల వలే కాకుండా ఐఎఫ్ఏఎస్ అధికారులు లోతట్టు ప్రాంతాలకు సైతం వెళ్లేవారు. సాయుధ అంగరక్షకులు లేకుండా, తరచూ భార్యలతో కలిసి వెళ్లేవారు. ఈ వ్యవహారశైలి, స్థానికులతో సౌహార్ధత, సాన్నిహిత్యం పెంపొందించుకునేందుకు విశేషంగా తోడ్పడింది.

ఎల్విన్ జీవితచరిత్ర రచనకై నా పరిశోధనా వ్యాసంగాలలో భాగంగా విశ్రాంత జీవనంలో ఉన్న ఐఎఫ్ఏఎస్ అధికారులు కొంత మందిని ఇంటర్వ్యూ చేశాను. తొలుత హర్‌మందర్ సింగ్, ఆ తరువాత రషీద్ యూసఫ్ అలీ, ఆర్ఎన్ఎన్ హల్దిపర్, టీఎస్ మూర్తి, ఎన్‌డీ జయాళ్‌తో వివిధ విషయాల గురించి మాట్లాడాను. ప్రతి ఒక్కరూ నీఫాలో తమ ఉద్యోగ కాలపు అనుభవాల గురించి ఉత్సాహంగా మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి బయటి ప్రపంచం అంతగా తెలియని ఆదివాసులతో సంబంధాలు నెలకొల్పుకుని వారి విశ్వాసాన్ని ఎలా చూరగొన్నదీ సంవేదనశీలతతో వివరించారు.

పథ నిర్దేశక పాలన నందించిన ఐఎఫ్ఏఎస్ అధికారులలో ఒకరైన బాబ్ ఖథింగ్ పురాతన బౌద్ధ సంఘారామాల పట్టణమైన తవాంగ్‌ను భారతదేశ నియంత్రణలోకి తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. ఇండో–టిబెటన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఎగువ శుభంసిరి లోయలోని ఆదివాసులతో సంబంధాలు ఏర్పరచుకున్న భారత ప్రభుత్వ అధికారులలో ఎస్ఎమ్ కృష్ణాత్రి ప్రప్రథముడు. నీఫాకు ఎల్విన్ నిర్దేశించిన, నెహ్రూ ఆమోదించిన పాలనా వ్యూహాలను సమర్థంగా, మానవీయంగా అమలుపరిచినవారుగా ఐఎఫ్ఏఎస్ అధికారులు గౌరవమన్ననలు పొందారు. ఐఎఫ్ఏఎస్ అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో మిష్మి ఆదివాసీ విద్యావంతుడు ఒకరు తనకు చెప్పిన మాటలను ఎల్విన్ సదా మనసులో ఉంచుకున్నారు. ఆ మిష్మి గిరిజనుడు ఎల్విన్‌ను ఇలా సూటిగా, స్పష్టంగా హెచ్చరించారు: 'గుర్తుంచుకోండి, సంస్కృతిపరంగా చూసినా, జాతిపరంగా చూసినా మేము భారతీయులం కాబోము. మా సంస్కృతిని, మతాన్ని తక్కువ చూపు చూసే, అసలు మమ్ములను తోటి మనుషులుగా గుర్తించని అధికారులను మా వ్యవహారాల నిర్వహణకు పంపితే కొద్ది సంవత్సరాలలోనే మేము మీకు నిశ్చితంగా వ్యతిరేకులమవుతాము'. ఐఎఫ్ఏఎస్ అధికారులు తమ విధులను నిర్వహిస్తున్న తీరుతెన్నులను ప్రధాని నెహ్రూ విశేష శ్రద్ధాసక్తులతో పర్యవేక్షిస్తుండేవారు. నెహ్రూ వారికి చెప్పిన మాటలను ఒక అధికారి ఇలా గుర్తుచేసుకున్నారు: 'సిబ్బంది జాతీయ పతాక వెంట వెళ్లాలి. టైప్ రైటర్లు ఆ తరువాత వస్తాయి'. నిగూఢంగా ఉన్న ఈ గంభీరమైన మాటల అర్థం ఇది: 'ప్రజలే ప్రథమం. అధికారిక ప్రభుత్వ వ్యవస్థలను ప్రవేశపెట్టే ముందు పాలనా సిబ్బంది ప్రజల గౌరవాన్ని, స్నేహాన్ని సంపాదించుకోవాలి. స్థానికులతో సత్సంబంధాలను ఏర్పరచుకున్న తరువాతే అధికారిక ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి క్రమబద్ధమైన పాలననందించాలి'. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ అధికారుల వలే కాకుండా ఐఎఫ్ఏఎస్ అధికారులు లోతట్టు ప్రాంతాలకు సైతం వెళ్లేవారు. సాయుధ అంగరక్షకులు లేకుండా, తరచూ భార్యలతో కలిసి వెళ్లేవారు. ఈ వ్యవహారశైలి, స్థానికులతో సౌహార్ధత, సాన్నిహిత్యం పెంపొందించుకునేందుకు విశేషంగా తోడ్పడింది. ఎల్విన్ జీవితచరిత్ర రచనకై నా పరిశోధనా వ్యాసంగాలలో భాగంగా విశ్రాంత జీవనంలో ఉన్న ఐఎఫ్ఏఎస్ అధికారులు కొంత మందిని ఇంటర్వ్యూ చేశాను. తొలుత హర్‌మందర్ సింగ్, ఆ తరువాత రషీద్ యూసఫ్ అలీ, ఆర్ఎన్ఎన్ హల్దిపర్, టీఎస్ మూర్తి, ఎన్‌డీ జయాళ్‌తో వివిధ విషయాల గురించి మాట్లాడాను. ప్రతి ఒక్కరూ నీఫాలో తమ ఉద్యోగ కాలపు అనుభవాల గురించి ఉత్సాహంగా మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి బయటి ప్రపంచం అంతగా తెలియని ఆదివాసులతో సంబంధాలు నెలకొల్పుకుని వారి విశ్వాసాన్ని ఎలా చూరగొన్నదీ సంవేదనశీలతతో వివరించారు. పథ నిర్దేశక పాలన నందించిన ఐఎఫ్ఏఎస్ అధికారులలో ఒకరైన బాబ్ ఖథింగ్ పురాతన బౌద్ధ సంఘారామాల పట్టణమైన తవాంగ్‌ను భారతదేశ నియంత్రణలోకి తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. ఇండో–టిబెటన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఎగువ శుభంసిరి లోయలోని ఆదివాసులతో సంబంధాలు ఏర్పరచుకున్న భారత ప్రభుత్వ అధికారులలో ఎస్ఎమ్ కృష్ణాత్రి ప్రప్రథముడు. నీఫాకు ఎల్విన్ నిర్దేశించిన, నెహ్రూ ఆమోదించిన పాలనా వ్యూహాలను సమర్థంగా, మానవీయంగా అమలుపరిచినవారుగా ఐఎఫ్ఏఎస్ అధికారులు గౌరవమన్ననలు పొందారు.

# మలుపులు తిరుగుతున్న మెట్రో...

హైదరాబాద్ : హైదరాబాద్ లాంటి అంతర్జాతీయ మహానగరానికి ప్రజా రవాణా వ్యవస్థలో గుండెకాయ లాంటి మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి ప్రభుత్వ పరం కావాల్సిన కీలక తరుణంలో సరికొత్త మలుపులు తిరుగుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహిస్తున్న నిర్మాణ దిగ్గజం ఎల్అండ్‌టీ దీని నుండి పూర్తిగా తప్పుకుంది. అయితే, ఎల్అండ్‌టీ నుంచి మెట్రో ఫేజ్–1 టేకోవర్ ప్రక్రియ ఇప్పటికే నత్తనడకన సాగుతుండగా, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తాజా ఢిల్లీ చర్చల తర్వాత రంగంలోకి దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ క్యాప్స్ రావడం ప్రాజెక్టు భవితవ్యంపై తీవ్ర ఆసక్తితో పాటు పలు ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఢిల్లీ వేదికగా జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రాజెక్టు వాల్యుయేషన్ బాధ్యతలను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ఎల్అండ్‌టీ సంస్థ మెట్రో ప్రాజెక్టు కోసం చేసిన అప్పులు, సేకరించిన నిధులు, రియల్ ఎస్టేట్ ద్వారా వస్తున్న ఆదాయం , ప్రస్తుతం ప్రాజెక్ట్ విలువ ఎంత ఉందనే దానిపై ఎస్‌బీఐ క్యాప్స్ ఒక నిష్పాక్షికమైన నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగానే తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్‌టీకి ఎంత పరిహారం చెల్లించి ప్రాజెక్టును తన చేతుల్లోకి తీసుకోవాలనేది ఖరారవుతుంది. అయితే, ఈ ప్రక్రియ వల్ల మెట్రో సమస్య త్వరగా పరిష్కారమవుతుందా లేదా వాల్యుయేషన్ల లొసుగులతో మరింత కాలయాపన జరిగి మొదటికే వస్తుందా అనే సందిగ్ధత నెలకొందిరోజుకు దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తున్నప్పటికీ హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 ఆశించిన స్థాయిలో లాభాలను తీసుకురావడం లేదు. కోవిడ్ లాక్‌డౌన్ దెబ్బ, కా ఐటీ కారిడార్‌లో ఆక్యుపెన్సీ హెచ్చుతగ్గుల వల్ల ఎల్అండ్‌టీ సంస్థ భారీగా నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఇచ్చిన రూ. 3,000 కోట్ల సాఫ్ట్ లోన్ కూడా సంస్థను పూర్తి గట్టెక్కించలేకపోయింది. దీంతో తమ కోర్ బిజినెస్ పైనే దృష్టి పెట్టాలని, మెట్రో లాంటి భారీ రాయితీ ప్రాజెక్టుల నుండి గౌరవప్రదంగా తప్పుకోవాలని ఎల్అండ్‌టీ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా సింగిల్ హ్యాండ్‌తో టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇందుకు కొన్ని కఠిన నిబంధనలు పెడుతోంది. ఢిల్లీ, బెంగళూరు మెట్రో తరహాలోనే హైదరాబాద్ మెట్రోను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 జాయింట్ వెంచర్ మోడల్‌లోకి మార్చాలని కేంద్రం సూచిస్తోంది. ఈ వ్యూహాత్మక మార్పుకు అంగీకరిస్తే కేంద్రం నుండి నిధుల లభ్యత సులువవుతుంది కానీ, పూర్తి నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లో ఉండదు.

ఫేజ్–1 టేకోవర్ వివాదం ఒక కొలిక్కి రాకపోతే, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 విస్తరణ పనులపై ఆ ప్రభావం పడక తప్పదు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, నాగోల్–ఎల్బీనగర్ కనెక్టివిటీ, శేరిలింగంపల్లి కారిడార్ల విస్తరణకు వందల కోట్లు అవసరమవుతాయి. పాత లయబిలిటీస్ ఎవరు తీర్చాలనే స్పష్టత లేకపోతే, అంతర్జాతీయ బ్యాంకులైన జైకా , ఏడీబీ ల నుండి కొత్త ప్రాజెక్టులకు రుణాలు రావడం కష్టతరంగా మారుతుంది. ప్రస్తుతానికైతే హైదరాబాద్ మెట్రో భవితవ్యం పూర్తిగా ఎస్‌బీఐ క్యాప్స్ ఇవ్వబోయే ఫైనాన్షియల్ అసెస్‌మెంట్ నివేదికపైనే ఆధారపడి ఉంది. ఎల్అండ్‌టీ ఆశిస్తున్న కమర్షియల్ సెటిల్‌మెంట్‌కు, రాష్ట్ర ప్రభుత్వం భరించగలిగే బడ్జెట్ పరిమితులకు మధ్య ఎస్‌బీఐ క్యాప్స్ ఎలాంటి రాజీ ఫార్ములాను ప్రతిపాదిస్తుందనేది ఇక్కడ అత్యంత కీలకం.

## 15 ఏళ్ల సమస్యకు మంత్రి పరిష్కారం

కరీంనగర్ : బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కొత్త సర్వీసు ప్రారంభించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపించారు. దీంతో ఆ మార్గంలోని గ్రామాలు.. గత 15 ఏళ్లుగా బస్సు కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. దీంతో వారు మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా తమ మార్గంలో బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరినా.. ఎవరూ పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి తమ గోడు విని స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత యుగంలో ప్రజల జీవనశైలి శరవేగంగా మారిపోతున్నా.. కొన్ని మారుమూల ప్రాంతాలు మాత్రం వెనకబడిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ప్రశ్నలకు దారితీస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలాంటి గ్రామాలకు మౌలిక వసతుల కల్పన జరిగితే.. ఆ జనాల్లో వచ్చే ఆనందాలే వేరు. ఇలా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వారి దీనస్థితిని చూసి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు రంగంలోకి దిగి.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి వారి మొహాల్లో చిరునవ్వులు చిందేలా చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వారికి బస్సు సౌకర్యం వచ్చింది. ఈ బస్సు సర్వీసు జగిత్యాల నుంచి ప్రారంభమై.. వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు గతంలో నడిచేది. కానీ ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆ మార్గంలో ఉండే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే తమకు తిరిగి బస్సు సౌకర్యం కల్పించాలని.. గత 15 ఏళ్లుగా ఎంతోమందికి విజ్ఞప్తులు, వినతులు పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని వారికి తిరిగి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రోజున అబ్బాపూర్ గ్రామంలో కొత్త బస్సు సర్వీసును మంత్రి అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అడ్లూరి.. బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు చాలాసార్లు తనకు విజ్ఞప్తి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు బస్సు సౌకర్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. స్థానిక గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అదే సమయంలో అబ్బాపూర్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా మంత్రి అడ్లూరి ప్రారంభించారు. అదే సమయంలో ఆ గ్రామంలో మూతబడిన పాఠశాల తిరిగి పునరుద్ధరించగా.. దాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఇక ఆ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా గ్రామస్థులు కృషి చేయాలని హితవు పలికారు.

## పశ్చిమాసియాలో భారత్ ప్రభావం తగ్గిపోయింది: సోనియా

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు.. పాలస్తీనా, గాజా సంక్షోభంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక ఇంగ్లీష్ దినపత్రికకు రాసిన వ్యాసంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రధాని మోదీ వహిస్తున్న 'రాతి మౌనం' దేశ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆమె ఆరోపించారు. ఇన్నాళ్లూ పశ్చిమాసియా ప్రాంతంలో, గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత దేశానికి ఉన్న సంప్రదాయ, చరిత్రాత్మక వ్యూహాత్మక ప్రాభవాన్ని ప్రస్తుత మోదీ ప్రభుత్వం పూర్తిగా బలహీనపరిచిందని సోనియా గాంధీ విమర్శించారు. గాజాలో ఇజ్రాయెల్ దాడుల వల్ల వేలాది మంది అమాయక పిల్లలు, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నా, వెస్ట్ బ్యాంక్‌లో లక్షలాది పాలస్తీనా కుటుంబాలు బలైపోతున్నా భారతదేశం నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితమైందన్నారు. 'పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు భారత్ ఒక కీలక దౌత్య పాత్ర పోషించే అద్భుతమైన అవకాశం ఉన్నప్పటికీ, మోదీ ప్రభుత్వం దానిని చేజేతులా వదిలేసింది. ఈ వ్యూహాత్మక మౌనాన్ని అటు నైతికంగా గానీ, ఇటు దేశ ప్రయోజనాల పరంగా గానీ సమర్థించలేం'. అని సోనియా గాంధీ అన్నారు.

### పాకిస్థాన్ చేతికి చిక్కిన అవకాశం!

భారత్ వహించిన మౌనాన్ని ఆసరాగా చేసుకుని, మన పొరుగు దేశమైన పాకిస్థాన్ పశ్చిమాసియా శాంతి చర్చల్లో చొరవ తీసుకుని తన ప్రభావాన్ని అంతర్జాతీయంగా పెంచుకుందని సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఆ ప్రాంతంలో తన పాత మిత్రదేశాలైన పాలస్తీనా, ఇరాన్ వంటి దేశాలకు క్రమంగా దూరమవుతూ, ఇజ్రాయెల్ వ్యూహాత్మక వలలోకి పూర్తిగా జారిపోతోందని ఆమె విమర్శించారు.

### సోనియా గాంధీ వ్యాసానికి ఖర్గే, రాహుల్ మద్దతు

సోనియా గాంధీ వ్యక్తపరిచిన ఈ ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు గట్టి మద్దతు పలికారు. సోనియా రాసిన భావోద్వేగభరితమైన వ్యాసం మోదీ ప్రభుత్వ ఉదాసీనతను ఎత్తిచూపిందని, ప్రపంచ ప్రజాభిప్రాయానికి భిన్నంగా భారత్ ఒంటరిగా మారుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే X (ట్విట్టర్) లో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ చర్యలను తప్పుబడుతుంటే, భారత్ మాత్రం ఆ దేశానికి రాజకీయ మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందని, భారత్ తన సొంత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తిరిగి పునరుద్ధరించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.

## తెలంగాణకు మరణ శాసనంగా మారిన రేవంత్ అజ్ఞానం హరీష్ రావు..

హైదరాబాద్ : తన రాజకీయ గురువుకు 'గురుదక్షిణ'గా రాష్ట్ర జలహక్కులను తాకట్టు పెడుతున్న రేవంత్.. తెలంగాణను ముంచే 'ముంపు మేస్త్రి'గా మారాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. నదీ జలాలపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి అజ్ఞానం.. నేడు తెలంగాణకు మరణ శాసనంగా మారింది. కేసీఆర్ గారు పోరాడి సాధించిన ప్రాజెక్టుల అనుమతులను గాలికి వదిలేసి.. తన రాజకీయ స్వార్థం కోసం రాష్ట్ర భవిష్యత్తును రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నాడు.. కర్ణాటక, ఏపీ అక్రమ ప్రాజెక్టులతో తెలంగాణను ముంచుతుంటే.. అడ్డుకోవాల్సిన సీఎం వారితో కలిసి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. మంత్రి ఉత్తమ్ను బయటపెట్టి.. ఏపీ అధికారితో సీక్రెట్ మీటింగ్ లో ముగ్గురు సీఎంలు చేసుకున్న ఆ 'చీకటి ఒప్పందం' ఏంటో రేవంత్ బయటపెట్టాలి. నదుల అనుసంధానం పేరిట ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేస్తూ.. తెలంగాణ సమ్మక్క సాగర్ ప్రాజెక్టును రేవంత్ బలిపెడుతున్నాడు. కూలగొట్టే హైడ్రాకు 'హిట్లర్' స్ఫూర్తన్న రేవంత్ రెడ్డి.. మన నీళ్లు ఎత్తుకుపోతుంటే ఫిడేల్ వాయించిన 'నీరో చక్రవర్తి'లా చోద్యం చూస్తున్నాడు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో ఏకంగా 383 టీఎంసీల అనుమతులు సాధిస్తే.. ఈ కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో కనీసం ఒక్క టీఎంసీకి కూడా అనుమతి సాధించలేదని అన్నారు.

## మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ మోతీనగర్ ఫుడ్ పాయిజన్ కలకలం

మహబూబ్ నగర్ : జిల్లా కేంద్రంలో న్యూ మోతీనగర్ లో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. రెండు రోజుల క్రితం ఓ పెళ్లి వేడుకలో మిగిలిన కద్దు కా కీర్ను కాలనీలో పిల్లలు, పెద్దలకు మహిళ పంపిణీ చేసింది. కద్దు కా కీర్ తిన్న తర్వాత సుమారు 30మందికి వాంతులు అయ్యాయి. పరిస్థితి విషమించడంతో వారిని జీజీహెచ్ లో 13మంది చిన్నారులు, ఏడుగురు పెద్దలు చేరారు. కలుషిత ఆహారం తిని ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. వైద్యులతో బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు.

## చంద్రబాబు గొడ్డలిని లోకేష్ చేతిలో పెట్టారు

గుంటూరు : మమ్మల్ని అడ్డుకుంది రైతులు కాదు.. టీడీపీ గూండాలే చంద్రబాబు గొడ్డలిని లోకేష్ చేతిలో పెట్టారని మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు ఆరోపించారు. నారా లోకేష్ ప్రోద్బలంతోనే టీడీపీ గూండాల దాడులు జరిగాయి. రైతుల ముసుగులో టీడీపీ గూండాలు మమ్మల్ని అడ్డుకున్నారు. టీడీపీ గూండాల దాడులను మేం లెక్కచేయం. దాడులను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటాం. చంద్రబాబు గొడ్డలిని లోకేష్ చేతిలో పెట్టారు. లోకేష్ చేతిలో గొడ్డలి పెట్టి చంద్రబాబు నాటకాలు. ఎవరెంత అడ్డుకున్నా రైతుల పక్షాన పోరాడతాం. రైతుల విజ్ఞప్తితోనే జగన్ పరిరక్షణ కమిటీ వేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## పాలమూరుకు బ్రహ్మోస్ యూనిట్

మహబూబ్ నగర్ : పాలమూరు జిల్లాకు ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ రానుందనే ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. ప్రతిపాదిత ప్రాంతంపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గతేడాది జూన్ 18న సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రాంతంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ను విస్తరించాలని సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ ? బెంగళూరు మధ్యలో మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలో అవసరమైన ప్రభుత్వ స్థలం ఉందని వివరించారు. సీఎం వినతికి స్పందించిన ప్రతినిధులు ఆ తర్వాత మూడురోజుల్లోనే స్థల పరిశీలన చేసి నివేదిక రూపొందించారు. వాస్తవంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వాయ్ పల్లి, చౌదర్ పల్లి గ్రామాల మధ్య సుమారు 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుంది. W 44, W 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలతో ఇబ్బందులు లేవు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100కిలో మీటర్ల దూరంలోనే ఉంది. గతేడాది స్థల పరిశీలన చేసిన అధికారులు పలు సూచనలు చేసినట్లు సమాచారం. మిగతా ప్రాంతాల్లోనూ స్థల అన్వేషణ చేసినా ఆఖీఆఒ బృందం పాలమూరు జిల్లా వైపే మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు మరోసారి చర్చకు రావడంతో చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామస్థుల్లో ఆశలు పెరిగాయి. దేశ రక్షణలో కీలకంగా మారిన మిస్సైల్ తయారీ తమ ప్రాంతంలో తయారు కావడాన్ని గర్వంగా ఫీల్ అవుతామంటున్నారు. అన్ని సౌకర్యాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కచ్చితంగా ఈ బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు, ప్రాంత అభివృద్ధికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ఏర్పాటు విషయంలో కేంద్రం అనుమతి వస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. అనుమతి వస్తే దేశ రక్షణ వ్యవస్థలో పాలమూరు ఖ్యాతి ఇమిడిపోనుంది.

## శంషాబాద్ బస్టాండ్లో ఆర్టీసీ అధికారుల కొరడా

రంగారెడ్డి: శంషాబాద్ ఆర్టీసీ బస్సుస్టాండ్లో షట్టర్ల పేరుతో ఏళ్ల తరబడి దందా చేస్తున్న ఎగవేతదారుల ఆటకు తెరపడింది. ప్రభుత్వ సొమ్ముకు ఎగనామం పెట్టి, లక్షలకు లక్షలు జేబులోవేసుకుంటున్న షట్టర్ యజమానులపై ఆర్టీసీ అధికారులు చివరకు కొరడా ఝూలిపించారు! శంషాబాద్ బస్టాండ్ ఆవరణలో ఉన్న 9 కమర్షియల్ షట్టర్లను ఐదేళ్ల క్రితం నెలకు కేవలం5 వేల రూపాయలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అసలు కథ ఇక్కడే మొదలైంది. ఆర్టీసీకి నెలనెలా కట్టాల్సిన 5 వేలు కట్టకుండా, అదే షట్టర్లను ప్రైవేటు వ్యక్తులకు 20 నుంచి 30 వేల రూపాయలకు అద్దెకు ఇచ్చి నెలనెలా లక్షలు దండుకుంటున్నారు ఈ దళారులు. ప్రభుత్వ సొమ్మును గుంజి సొంత జేబులు నింపుకుంటున్న వీరికి ఆర్టీసీ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా లెక్కచేయలేదు. 'డబ్బులు కట్టండి' అని మొత్తుకున్నా చెవికెక్కలేదు. లీజు గడువు ముగిసినా, ఖాళీ చేయకుండా దర్జాగా వ్యాపారాలు కొనసాగించారు. ఎగవేతదారుల నిర్లక్ష్యంతో సహనం కోల్పోయిన రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి ఈరోజు ఉదయం పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. బకాయి పడ్డ 9 షట్టర్లకు నోటీసు బోర్డులు అంటించి సీల్ వేశారు. మిగతా వారికి కూడా గడువులోగా బకాయిలు చెల్లించాలని హెచ్చరిక నోటీసులు జారీ చేశారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలి




## - ప్రత్యేక అధికారి సవ్యసాచి గోష్

(సమయం ప్రతినిధి) : ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్లాగ్‌షిప్ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు విభాగం, సీఎస్ఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి గోష్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి శాఖ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని నిర్దిష్ట గడువులో పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను అభినందించారు. ఇదే పనితీరును భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల పురోగతిని ప్రత్యేక అధికారికి వివరించగా, వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల పనితీరును వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, సీపీఓ సౌమ్య, ట్రాఫిక్ డీసీపీ, ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, సరిత, డీపీఓ సురేశ్ మోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు నాగర్ కర్నూల్ కు మంత్రి నితిన్ గడ్కరీ రాక



నాగర్ కర్నూల్ : 28-06-2026 (ఆదివారం) ఉదయం 11:00 గంటలకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో నూతనంగా నిర్మించిన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయాన్ని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవనీయులు నితిన్ నబిన్ గారు హైదరాబాద్ నుండి వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించి, అనంతరం నిర్వహించే సభలో పాల్గొంటారన్నారు. కావున జిల్లాలోని రాష్ట్ర పదాధికారులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు మండల పదాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్రం మరియు బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బంధు మిత్రులు అందరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి చేశారు. మండల అధ్యక్షులు తమ తమ మండలాల్లోని బాధ్యతగల ప్రతి నాయకుడిని వ్యక్తిగతంగా ఆహ్వానించి జిల్లా నూతన కార్యాలయానికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమం అనంతరం అందరికీ భోజన ఏర్పాట్లు ఉన్నాయని నాగర్ కర్నూలు జిల్లా బిజెపి అధ్యక్షులు వేముల నరేందర్రావు తెలిపారు.

## జోగులాంబ గద్వాల జిల్లాలో 73 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లాలోని మూడు ఐసీడీఎస్ (ఐసీడీఎస్) ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 73 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో 64 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, గిరిజన ప్రాంతాలకు చెందిన 9 అంగన్‌వాడీ ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో గద్వాల అర్బన్ ప్రాజెక్టులో 28 టీచర్, 5 ఆయా పోస్టులు, మల్దకల్ ప్రాజెక్టులో 22 టీచర్, 4 ఆయా పోస్టులు, మానవపాడు ప్రాజెక్టులో 14 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థులు జూన్ 29 నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, నిబంధనలు తదితర పూర్తి వివరాలు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నియామక ప్రక్రియను అవసరమైతే ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ప్రభుత్వ, నాలా భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

### అయిజ మున్సిపల్ కమిషనర్‌కు భీమ్ ఆర్మీ ఫిర్యాదు

సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ సమీపంలో, అయిజ-గద్వాల రహదారిపై మార్కెట్ పక్కన ఉన్న ప్రభుత్వ, నాలా భూములను కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ భీమ్ ఆర్మీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మాచర్ల ప్రకాష్ శనివారం అయిజ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వెంటనే వాటిని నిలిపివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తూ అక్రమ కట్టడాలను తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యుగేందర్, మల్దకల్ వడ్డే రాము, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 28న పల్స్ పోలియో

### ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలి.

అల్లూరి జిల్లా పాడేరు/ హుకుంపేట : రాష్ట్రవ్యాప్తంగా నేడు అనగా జూన్ 28, 2026 న ఐదేళ్లలోపు పిల్లలందరికీ "పల్స్ పోలియో" చుక్కల మందు వేసేందుకు ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు శనివారం (జూన్ 27) నాడు వైద్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు."పోలియో ఆదివారం" పురస్కరించుకుని జరిగిన ఈ అవగాహన ర్యాలీలో వైద్యులతో పాటు స్థానిక ఆరోగ్య సిబ్బంది పాల్గొని, "నిండు జీవితానికి 2 చుక్కలు" అనే నినాదంతో రూపొందించిన బ్యానర్లను ప్రదర్శించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి కృష్ణ మూర్తి నాయక్ మాట్లాడుతూ... భారతదేశం ప్రస్తుతం పోలియో రహిత దేశంగా ఉన్నప్పటికీ, పొరుగు దేశాల నుండి ఈ వైరస్ తిరిగి వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. మన పిల్లలకు శాశ్వత రక్షణ కల్పించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు ఇప్పించాలని కోరారు.ఈ నెల తేదీ: 28 జూన్ 2026 (ఆదివారం)నీ వయసు,ఇప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు వయసు గల పిల్లలందరూ జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి తల్లిదండ్రులు వారి బిడ్డలను పోలియో చుక్కల కేంద్రానికి తీసుకెళ్లి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమం రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్య 2026 కుటుంబ సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతల్లిదండ్రులందరూ రేపు ఉదయాన్నే తమ సమీపంలోని పోలియో కేంద్రాలకు చేరుకుని, తమ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.ఈ ర్యాలీ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ తో పాటు, హుకుంపేట డాక్టర్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపల్లిలో వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

(సమయం ప్రతినిధి) : దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి (ఎంఈఓ) పి. బాలరాం, దేవరకద్ర బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కె. నాగేంద్రమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఉచితంగా పలకలు, బలపాలు పంపిణీ చేసి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి. బాలరాం, స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్ఎం కె. నాగేంద్రమ్మ మాట్లాడుతూ బడీడు వయస్సు కలిగిన ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్. కల్పన, ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్, రెడ్డిగారి బిజిలి విజయలక్ష్మి, తూడి నాగేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, విద్యాభిమాని కొండయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఆమనగల్‌లో కాంగ్రెస్ బీఎల్‌ఏల ఆత్మీయ సమ్మేళనం



కల్వకుర్తి : నియోజకవర్గంలోని ఆమనగల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ) మరియు సూపర్వైజర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గౌరవ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ ఇన్‌చార్జ్ రాచమల్ల సిద్దేశ్వర్ , అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీమతి సంధ్యా రెడ్డి , బీఎల్ఏ స్పెషల్ ఇన్‌చార్జ్ లిగొరీ సతీష్ హాజరై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ "రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో బీఎల్ఏల పాత్ర చాలా ముఖ్యం. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ఆ ఓటు హక్కును ప్రతి అర్హుడికి చేర్చే బాధ్యత మీ భుజస్కంధాలపై ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీకి వారధిగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు చేర్చడంలో మీ కృషి ఎనలేనిది. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే బాధ్యత మీదే" అని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ లిఠాకూర్ బాలాజీ సింగ్ లి, పీసీసీ సభ్యులు లిశ్రీనివాస్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సూపర్వైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో జోరందుకున్న "SIR" కార్యక్రమం

ఓటర్ జాబితా సవరణలో బి.ఆర్.ఎస్. బూత్ ఏజెంట్లు విధిగా పాల్గొనండి.
నాయకులను కార్యకర్తలను అప్రమత్తం చేసిన గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్.



వనపర్తి : SIR కార్యక్రమంలో భాగంగా ఓటర్ జాబితా సవరణ చేపట్టాలని బి.ఆర్.ఎస్ పార్టీ బూత్ ఏజెంట్లకు, నాయకులకు, కార్యకర్తలకు జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పిలుపునిచ్చారు.వనపర్తి మండలంలోని పెద్దగూడెం,కడుకుంట్ల, మెంటంపల్లి పలు గ్రామాలలో నాయకులతో కలసి పర్యటించారు.ఈ సందర్భంగా గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, మాట్లాడుతూ SIR కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు యజ్ఞంలా భావించి ప్రతి గడప తిరుగుతూ నమోదు,మార్పులు, చేర్పులు కార్యక్రమం చేపట్టాలని అన్నారు. గ్రామ బి.ఎల్.ఓ లతో ప్రభుత్వపరంగా చేపడుతున్న విధి విధానాల గూర్చి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కె.మాణిక్యం, మాజీ జెడ్పిటిసి ధర్మనాయక్, రైతుబంధు అధ్యక్షులు దేవర్ల నరసింహ నాయకులు, చిట్యాల రాము గ్రామ సర్పంచ్ తిరుపతయ్య, నాయకులు మనీష్, చిన్న రెడ్డి, శ్రీనివాసులు, అశోక్, చిరంజీవి, అశోక్, తదితరులు ఉన్నారు.

## పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి: జిల్లా కలెక్టర్ కె. హైమావతి.

సిద్దిపేట : నేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కె. హేమావతి ఒక ప్రకటనలో తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా 94,321 అర్హులైన 0-5సంవత్సర ల పిల్లలకు చుక్కలు వేసేందుకు 568 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు, కార్యక్రమం విజయ వంతం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్ రాజ్ నేతృత్వంలో 57 మంది సూపర్వైజర్ల, డివై, డీఎంహెచ్వో లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ల పర్యవేక్షణలో 32 ట్రాన్సస్ట్ పాయింట్లను బస్టాండు, రైల్వేస్టేషన్లో, పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇవే కాకుండా మొబైల్ టీం ల ద్వారా సమస్యాత్మక ప్రదేశాల్లో ఇటుక బట్టీలు, భవన నిర్మాణ రంగాల ప్రాంతంలో, సిమెంట్ ఫ్యాక్టరీలు, క్వారీలు, భిక్షాటన కొరకు వలస వచ్చిన వారి అర్హులైన పిల్లలను గుర్తించి చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యం కేంద్రాలు, బస్తీ దవాఖాన్ లో, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డను మొదలుకొనిఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణతో పాటు అవసరమైన సూచనలు అందించామని తెలిపారు.

సమయం
ఆదివారం 28 జూన్ 2026






# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- మహబూబాబాద్‌లో అవగాహన కార్యక్రమం**

**సమయం ప్రతినిధి :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ పట్టణంలోని స్నేహనగర్‌లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్-గూడూరు)లో స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనల మేరకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, డీఎస్పీ తిరుపతిరావు, ఇన్‌చార్జి సంక్షేమ అధికారి శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) నిశాంత్ కుమార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా యువజన, క్రీడల అధికారి జ్యోతి, విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, అప్పారావు, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ తదితరులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ, జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడం, మఫ్టీలో పోలీసులు గంజాయి సేవించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. గంజాయి సాగు, రవాణా, సరఫరాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు లేదా రవాణాపై సమాచారం ఉంటే 1098 నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు నగదు ప్రోత్సాహకం కూడా అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే బాల్యవివాహాల నివారణ కోసం ప్రత్యేక విభాగం పనిచేస్తోందని, ఇప్పటివరకు సుమారు 100 బాల్యవివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు డ్రగ్స్ నివారణపై ప్రసంగాలు, పాటలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు చిరంజీవి, సంబంధిత శాఖల సిబ్బంది చైతన్య, కమలాకర్, వీరన్న, నరేష్, హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

## నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డి సేవలు చిరస్మరణీయం





**- డీఈఓ రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డికి శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని వెంకట్రామ్ రెడ్డిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగంలో నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, విధి నిర్వహణలో సమయపాలన, పారదర్శకత, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేస్తూ ఉపాధ్యాయులు, సహోద్యోగులు, అధికారులు, ప్రజలందరి మన్ననలు పొందారని డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు. ప్రతి ఫైల్‌ను నిశితంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా వేగంగా పరిష్కరించడంలో వెంకట్రామ్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉందని డీఈఓ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ పనితీరు మెరుగుపడటంలో, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో ఆయన చేసిన సేవలు విశేషమని అన్నారు. జూనియర్ ఉద్యోగులకు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తూ, సేవాభావంతో పనిచేసిన ఆయన అందరికీ ఆదర్శప్రాయమైన ఉద్యోగిగా నిలిచారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ సేవలకు ముగింపు మాత్రమేనని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్న డీఈఓ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ తరఫున వెంకట్రామ్ రెడ్డి అందించిన విశిష్ట సేవలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తన అనుభవాన్ని సమాజ సేవకు వినియోగించాలని కోరారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సహోద్యోగులు వెంకట్రామ్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయనతో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వెంకట్రామ్ రెడ్డి కుటుంబ సభ్యులు, నోడల్ అధికారి కురుమయ్య, అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్ రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, సుజాత, టెక్స్ట్‌బుక్ మేనేజర్ నరసింహులు, సెక్టోరియల్ అధికారులు శోభారాణి, కిరణ్ కుమార్, వెంకటయ్య, నూరుద్దీన్, షర్ఫుద్దీన్, వెంకటేశ్వర శెట్టి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డికి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# వానా కాల్ వచ్చేస్తోంది... వంటా వార్పు ఎలా

నల్గొండ : ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.స్మార్ట్ క్లాస్‌రూమ్స్ గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో, ఇంకా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల మధ్యాహ్న భోజనం చెట్ల కిందే వండుతున్నారు. వర్షం వస్తే వంట ఆగిపోతుంది.. పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.చాలాచోట్ల నీటి వసతి లేని చోట వ్యవసాయ బావుల నుండి, సమీపంలోని ఇండ్ల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు వంటకి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ వర్షాకాలంలో తాము వంట చేయడానికి తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన వంట చెరుకు నిల్వ చేయడం, సామాగ్రి నిలువ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసే జులై, ఆగస్టు నెలలో వంట చేయడం తమకు పెద్ద తంటగా మారిందని వాపోతున్నారు.ఇక అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న హైస్కూళ్ళు, కొన్ని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి అనువైన వసతి లేక తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణ చెట్ల కింద భోజనం చేస్తున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో డైనింగ్ హాళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా చాలా చోట్ల పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.ఇక ఇదే తరహాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల నిర్మించలేదు. దీనితో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత పద్ధతిలో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మించి, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.కేసముద్రం మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో వంట సిబ్బంది చెట్ల కింద వంట చేయాల్సి వస్తుండగా, విద్యార్థులు తరగతి గదుల్లో లేదా ఆవరణలో భోజనం చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

## సౌభాగ్య మోడల్ 5 లేయర్ ఫార్మింగ్ రైతులకు ఆదర్శం

**- తెలంగాణ వ్యవసాయ కమిషన్ సభ్యులు శ్రీ కె.వి.ఎన్. రెడ్డి**

**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** ఐ ఫార్మ్స్ (iFARMS) ఆధ్వర్యంలో జాపల్లి గ్రామంలో జూన్ 27-28, 2026 తేదీలలో నిర్వహించిన "సౌభాగ్య మోడల్ 5 లేయర్ ఫార్మింగ్" శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కమిషన్ సభ్యులు శ్రీ కె.వి.ఎన్. రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, ఐదు పొరల వ్యవసాయ విధానం (5 Layer Farming), దేశీయ విత్తనాల పరిరక్షణ, గో ఆధారిత వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానాలు, రైతుల ఆదాయాన్ని పెంచే సుస్థిర వ్యవసాయ పద్ధతులపై నిపుణులు అందించిన వివరాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. విజయరామ్ , ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఇతర వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో మమేకమై, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే సహజ వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని కె.వి.ఎన్. రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ప్రకృతి అనుకూలమైన, బహుళ పంటల ఆధారిత సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులు అవలంబించాలి. సౌభాగ్య మోడల్ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు భూమి సారాన్ని, పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయం, ప్రకృతి వనరుల పరిరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ నిపుణులు, ప్రకృతి వ్యవసాయ ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ధాన్యం నగదు ఎప్పుడు

మహబూబ్ నగర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన భాగంగా, రైతులకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంతో ఒక ప్రక్క ఐకెపి కేంద్రాలు, మరొక పక్క సొసైటీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో డబ్బులు అందించి రైతులకు లబ్ధి చేకూరాలని లక్ష్యంతో కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశారు. ధాన్యం రైతు కొనుగోలు కేంద్రాల్లో పోసిన నాటి నుండి నేటి వరకు అనేక విధాలుగా కష్టపడి కాంటాలు పెట్టి, లారీలలో లోడ్ చేసి, మిల్లులో దిగుమతి చేశారు. నెల లు గడిచిన ధాన్యం నగదు రాకపోవడంతో రైతులు అనేక బాధలు పడుతున్నారు. మండలం లో మొత్తం 17 ఐకెపి కేంద్రాలు, 11 సహకార సొసైటీల ద్వారా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం అమ్మకాలు చేశారు. దీనిలో 17 ఐకెపి కేంద్రాల ద్వారా 2,60,780 క్వింటాల ధాన్యా న్ని సుమారు 3785 మంది రైతుల ద్వారా మిల్లులలో కొనుగోలు చేశారు. తుంగతుర్తి రైతు సేవ సహకార సొసైటీ 11 సెంటర్ల ద్వారా సుమారు, 3000 మంది రైతుల గాను, 500 రైతుల పైచిలుకు ధాన్యం బిల్లుల కోసం మిల్లుల చుట్టూ తిరుగుతున్నామని, సొసైటీ అధికారి పేర్కొన్నారు.ఐకెపి సెంటర్ల ద్వారా ప్రస్తుతం 3000 మందికి రైతులకు ధాన్యం అమ్మకాలపై డబ్బులు అందించినట్లు ఐకెపి ఎపిఎం యాదమ్మ తెలిపారు. 785 మంది రైతులకు, నెల రోజులు గడిచినప్పటికీ, నేటికి నగదు అందలేదని, అకౌంట్లో బిల్లులు పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం సీజన్ స్టార్ట్ అయినప్పటికీ, ఒక ప్రక్క విత్తనాలు మరొక ప్రక్క యూరియా, డిఏపి అవసరాలు ఉండగా, సమయానికి ప్రభుత్వం డబ్బులు పంపిణీ చేయలేదని, మాకు అప్పు కూడా పుడుతలేదని వివిధ గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి, సంబంధిత ఐకెపి సొసైటీ యాజమాన్యాలతో మాట్లాడి బిల్లులు వేగవంతంగా చేసి డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, మేధావులు, వివిధ పార్టీ నాయకులు కోరుతున్నారు.రైతు సేవ సహకార సొసైటీ ద్వారా సెంటర్ లో ధాన్యం పోసి అమ్మకం చేసి, రెండు నెలలు గడుస్తున్న నేటి వరకు కూడా నాకు డబ్బులు రాలేదు. దీనితో విత్తనాలు ,యూరియా కొనాలంటే ఇబ్బందికరంగా ఉంది. తక్షణమే అధికారులు స్పందించి, ధాన్యం బిల్లు వచ్చే విధంగా చూడాలి.ప్రస్తుతం ఈ సీజన్లో 2,60,000 785 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాము. సుమారు 3785 మంది రైతులకు గాను 3000 రైతులకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఇంకా సుమారు 785 మంది రైతులకు నగదు రావాల్సి ఉంది. ఈ చెల్లింపులకు అవసరమైన అన్ని పనులను సిబ్బందితో ఆన్ లైన్ లో ఇప్పటికే పూర్తి చేయించాం. నగదును తొందరగా ఇప్పించేందుకు కృషి చేస్తున్నాము.

## తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు చేసిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగర్ : కరీంనగర్-తిమ్మాపూర్ పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారంనాడు తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సీపీ గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, మరియు ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సీపీ నిశితంగా పరిశీలించారు.కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు మరియు వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు.







# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తండాల అభివృద్ధి

**రెండున్నర సంవత్సరాలలో తండాల అభివృద్ధికి 45 కోట్ల రూపాయలు పనులు**
**నియోజకవర్గ పరిధిలోని ప్రతి తండాకు సేవలాల్ ఆలయ నిర్మాణం చేపడతాం**
**ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సుయాత్ర కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు....తూడి మేఘారెడ్డి**
**భారీ ఎత్తున తమ బస్సు యాత్రకు స్వాగతం పలికిన ప్రజలందరికీ గిరిజన ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు.**



వనపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనతాండాలని అభివృద్ధి చెందాయని వనపర్తి నియోజకవర్గ పరిధిలోని తండాల అభివృద్ధికి రెండున్నర సంవత్సరాలలో 45 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజన ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు చేపట్టిన బస్సు యాత్ర శనివారం కొల్లాపూర్ నుంచి వనపర్తి నియోజకవర్గానికి చేరుకుంది.ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు అన్ని గ్రామాల నుంచి 8000 మందితో ర్యాలీగా వెళ్లి బస్సు యాత్రకు స్వాగతం పలికారు. వనపర్తి పట్టణ శివారు మెట్టుపల్లి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీతో అంబేద్కర్ చౌరస్తా కు చేరుకున్న నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అక్కడి నుంచి పాదయాత్రగా బయలుదేరి రాజీవ్ చౌరస్తా మీదుగా ఇందిరాగాంధీ పార్కు వద్దకు చేరుకొని స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు మురళి నాయక్, రామచంద్రనాయక్, బాలు నాయక్ రాందాస్ నాయక్, ఎంపీ బలరాం నాయక్మాజీ ఎమ్మెల్సీలు శంకర్ నాయక్రాములు నాయకులతో పాటు బేలయ్యానాయక్ రవీందర్ నాయక్ లు మాట్లాడారు. గిరిజన రిజర్వేషన్ కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సుయాత్ర వనపర్తి కి చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో తమకు ఇంత ఘనంగా స్వాగతం పలికిన గిరిజన సహోదరులందరికీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మొదటగా కృతజ్ఞతలు తెలియజేశారు. స్వతంత్రం వచ్చిన నాటి నుంచి గిరిజనుల సంక్షేమానికి పాటుపడిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనులంతా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారని వారు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండున్నర సంవత్సరాలలో గిరిజన తండాలలో ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని, ఉచిత కరెంటు నిస్తోందని, రేషన్ కార్డును అందజేసి నిరుపేద గిరిజనులకు సన్నబియాని పంపిణీ చేస్తూ మూడు పూటలా భోజనాన్ని అందిస్తుందని వారన్నారు.గిరిజనులు రిజర్వేషన్ కేటాయించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను మననం చేసుకుంటూ ఈ యాత్ర చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున తమకు స్వాగతం పలికి ఈ సమావేశానికి హాజరైన మీరు ఎప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరువకూడదన్నారు.గతంలో తండాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేదని నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి తండాకు పటిష్టమైన తారు రోడ్లు నిర్మించుకున్నామని వారి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల పక్షపాతి అని గిరిజనుల అభివృద్ధి కోసం ఆయన అహర్నిశలు కష్టపడుతున్నారని వారి పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గిరిజన నాయకులు మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సర్పంచ్ వాళ్లే నాయక్, గిరిజన గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు, అన్ని మండలాల గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జజ్జలి అంజన్న అంతిమయాత్రకు కదిలిన దండు



మక్తల్ : యాంకీ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జజ్జలి అంజన్న నిన్న బ్రేన్ స్ట్రోక్ తో నిన్న చనిపోవడం జరిగింది. తను బతికినన్ని రోజులు ప్రజల మధ్యలో స్నేహితుల మధ్యలో ప్రేమతో ఆప్యాయతో నవ్వుతూ నవ్విస్తూ వరుసలతో పిలుస్తూ అందరితో కలిసి మెలిసి ఉండి అందర్నీ వదిలి జజ్జలి అంజన్న (ఫీల్డ్ అసిస్టెంట్) క్రీస్తు శేషులు కావడాని చనిపోవడాని ప్రజలందరూ జీర్ణించుకోలేకపోయారు. వచ్చిన వాళ్ళందరూ దుఃఖ సాగరంలో మునిగి తేలారు. తమ బంధువులు, స్నేహితులు , గ్రామ ప్రజలు మండల ప్రజలు దండువల్లె దండ యాత్రగా కదిలిచ్చి నివాళులర్పించి అంతిమయాత్ర చివరిదాకా హాజరయ్యారు.తన ఇంటి నుంచి స్మశానం వాటిక వరకు అంతిమయాత్ర కొనసాగింది.తన ఉద్దేశించి తన మిత్రులు తన శ్రేయోభిలాషులు తన జ్ఞాపకాలు నెమరు వేసుకొని మాట్లాడడం జరిగింది. ఇలాంటి మంచి మనిషి, ప్రేమోదయం కలిగిన వాడు మన అందరిని విడిచిపోవడం అనేది బాధా కరమైన విషయంగా వ్యక్తం చేశారు. అందరూ ఘనంగా నివాళులర్పించారు.ఎంపీడీవో శ్రీని వాస్ , ఏపీఓ గౌరీ శంకర్, గ్రామ సర్పంచ్ భర్త వెంకటేష్, మాజీ జెడ్పిటిసి భర్త చిన్న వెంకట న్న, ఎస్సై శేఖర్, తన మిక్కిలి స్నేహితులు శేఖర్ పి వెంకటేష్, టి విజయ్ టి నాగరాజు, కార్తీక్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పి అరుణ్ కుమార్, జీ రమేష్ గ్రామస్తులు ఆచారి, కె.లింగన్న జె రాము, శరణ్, శ్రీపురం వెంకటేష్, సాకలి శీను, టి ప్రభు , టి.వెంకటన్న, రాకేష్ శివారెడ్డి,ఆనందు ,జనార్ధన్ ఎల్ఐసి హనుమంతు, ఉపసర్పంచ్ కర్రశేఖర్, తోకలి వెంకటన్న, బోయ ఆంజన్న హెల్పర్ నరసింహులు, పట్నం అంజన్న, పెద్ద కురుమన్న, రాయుడు, బాబు, తిరుమలేష్, మదన్మోహన్ రెడ్డి, విజయ్, నరసింహులు, రవి పాల్గొన్నారు.

## జిల్లా ప్రత్యేక అధికారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష

రాజన్న సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పాలన ప్రజలకు మరింత చేరువ అయిందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ,అటవీ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. మార్చి 6 వ నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 అంశాలతో వివిధ శాఖల ఆద్వర్యంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ , పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరుకాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్చం అందజేసిస్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడం, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా మార్చి 6నుంచి జూన్ 12 వ వరకు జిల్లాలో చేసిన అభివృధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, వివిధ ఫైళ్ల పరిష్కారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంపై జిల్లా యంత్రాంగం రూపొందించిన పీపీటీ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీపరిశీలించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు.

## విధేయత ... అనిశ్చితా...

విజయవాడ : వైసీపీలో మాత్రం జగన్ మాటకు ఎదురుండదు. ఆయన దృష్టిలో పడితే మంత్రి పదవి గ్యారంటీ. అందుకే వైసీపీ నేతలు యాక్టివ్ గా ఉంటారు. మిగిలిన పార్టీలలోఅలా ఉండదు. ఎవరికి చివరి నిమిషంలో మంత్రి పదవి దక్కుతుందన్నది ఎవరికీ తెలియదు. కానీ జగన్ విషయంలో అలా కాదు. తాను డిసైడ్ అయితే ఇక జగన్ ను ఇన్ ఫ్యూయెన్స్ చేసే మరొకరు పార్టీలో లేకపోవడంతో ఎక్కువ మంది నేతలు జగన్ దృష్టిలో పడతారు. అందుకే పదకొండు సీట్లకు పరిమితమయినా వైసీపీ మంచి ఊపు మీద ఉండటానికి ఇదే కారణం. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే తమకు ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అలాగని అంబటి రాంబాబు, పేర్ని నానిలు కేవలం పదవుల కోసమే చేసే వారు మాత్రం కాదు. జగన్ అంటే వారికి పిచ్చ అభిమానం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఇద్దరూ కాంగ్రెస్ లోనే ఉన్నారు. తర్వాత జగన్ పార్టీలో చేరారు. పార్టీ ఓడినా, గెలిచినా వీరు మాత్రం జగన్ మాట జవదాటరు. పార్టీని వదిలి వెళ్లాలన్న ఆలోచన చేయరు. జగన్ కోసం వీళ్లు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి మాత్రం ఎఫెన్స్ గానే ఉన్నారు. ఎన్ని కేసులు నమోదయినా వెనక్కుతగ్గరన్న పేరుంది. జగన్ పట్ల విధేయతగా ఉండటంతో పాటు జగన్ పై ఎవరు విమర్శించినా వెంటనే మీడియా ముందుకు వచ్చి నాలుగు దులిపి వెళతారు. ఇద్దరూ కాపు సామాజికవర్గం నేతలయినప్పటికీ ఏనాడూ జగన్ పార్టీ నుంచి బయటకు వెళ్లాలన్న ఆలోచన కూడా చేయరు. అంతేకాదు తమ సొంత సామాజివకర్గమే అయినా పవన్ కల్యాణ్ పై విమర్శలకు వెనుకాడరు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయాల్లో ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి. ఆయన తన నాయకులకు, ప్రతినిధులకు ఇచ్చే బాధ్యత చాలా క్లియర్ గా ఉంటుంది. ఎవరు ఏం మాట్లాడాలి, ఏం చేయాలి అన్న దానిపై సందిగ్ధత ఉండదు. జగన్ కోసమే నిలబడటమే తెలుసు తప్ప.. సొంత సామాజికవర్గం దూరమవుతుందన్న ఆలోచన కూడా చేయరు. అయితే వీళ్లిద్దరూ వైసీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవులు తమకు వస్తాయని ఆశించి మాత్రం విమర్శలు చేయరు. వీళ్లిద్దరూ జగన్ కు అత్యంత నమ్మకమైన నేతలు. జగన్ పై ఈగవాలినా ఊరుకునే రకం కాదు. అందుకే వైసీపీలో వీరిద్దరికీ ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

**పార్టీకి గుడ్ బై కొట్టనున్న ఆ ముగ్గురు :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి చాలామంది ఎమ్మెల్యేలు తెలుగుదేశం కూటమి వైపు చూస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ జాబితాలో ఓ ముగ్గురు ఇప్పుడు తాజాగా చేరారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీకి టచ్లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నారా లోకేష్ తో మాట్లాడినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా చర్చకు దారితీస్తోంది. అసలు టిడిపికి టచ్ లోకి ఎవరు వచ్చారు. టిడిపి వారిని తీసుకుంటుందా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ ఏదో జరుగుతోందన్న అనుమానాలు మాత్రం బలపడుతున్నాయి. ఒకరిద్దరూ టిడిపి ఎమ్మెల్యేల విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. స్థానిక పరిస్థితుల దృష్ట్యా వారు లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. అటువంటి వివాదాస్పద ఎమ్మెల్యేలకు వైసీపీ టచ్ లోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వారు వైసీపీలోకి వెళ్లిన మరుక్షణం.. వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలను లాగేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో రాయలసీమ నుంచి ఏడుగురు ఉన్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఓ ఇద్దరు గెలిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మరో ఇద్దరు ఉన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, బాల నాగిరెడ్డి, టి చంద్రశేఖర్, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ దాసరి సుధా, విశ్వేశ్వర రాజు, మత్స్యలింగం, అమర్నాథ్ రెడ్డి, విరూపాక్ష తదితరులు ఉన్నారు. అయితే ఇందులో రిజర్వుడు నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు అధికం. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో అసెంబ్లీకి హాజరు కావడం లేదు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇందులో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు ఈ నిర్ణయంతో విభేదిస్తున్నారు. వారంతా అసెంబ్లీకి వెళ్లాలని ఎక్కువగా కోరుకుంటున్నారు. కానీ ఆ కోరిక తీరడం లేదు.మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితులు కనిపించడం లేదు. కూటమి దూకుడుగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారం అందుతుంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉండడం కంటే కూటమిలో చేరడం ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చిన వారు ఉన్నారు. ప్రధానంగా ఓ ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు కూటమితో పాటు మంత్రి నారా లోకేష్ కు టచ్ లోకి వెళ్లినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. టిడిపిలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఎమ్మెల్యే పార్టీపై అసంతృప్తిగా ఉన్నారు. వైసిపి కి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఓ నేత సైతం అక్కడి ఎంపీ తో తీవ్రంగా విభేదిస్తున్నారు. ఆయన సైతం వైసీపీకి దగ్గరవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే ఆ ఎమ్మెల్యేలు కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీ నుంచి ఓ ముగ్గురు ఎమ్మెల్యేలు.. కూటమి వైపు రావడం ఖాయం అన్న ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే ఒక సంచలనమే.

## లాభలో బాటలో అవకడో రైతులు

కడప : రాయలసీమ రైతులు రూటు మార్చారు.. సంప్రదాయ పంటల్ని పక్కన పెట్టారు. సరికొత్త ప్రయోగాలతో భారీగా లాభాలు అందుకుంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన రైతు ఆపిల్ సాగు చేసి సక్సెస్ అందుకుంటే.. కడప జిల్లాకు చెందిన యువ రైతు అవకాడో సాగు చేసి ఆదాయం పొందారు. సేంద్రీయ ఎరువులు, బిందు సేద్యంతో విజయం సాధించారు. ఎరాకు ఏకంగా రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. రాయలసీమలో రైతులు వ్యవసాయంలో వినూత్న ప్రయోగాలతో అద్భుతాలు చేస్తున్నారు. కరువు ప్రాంతంగా పిలిచే ప్రాంతాల్లోనూ అధిక దిగుబడిని సాధిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తు?న్నారు. సీమ జిల్లాల్లో కంది, శనగ, ఉలవలు, పెసర్లు, వేరుశెనగ వంటి వాటితో పాటుగా గులాబీ, చామంతి, మల్లెలు కూడా సాగు చేస్తున్నారు. ఉద్యానవన పంటలైన అరటి, బత్తాయి, బొప్పాయి, దానిమ్మ, మామిడిని సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఉద్యానవన పంటల్లోనూ వినూత్నంగా ఆపిల్ సాగు చేసి సక్సెస్ అయ్యారు. తాజాగా మరో రైతు సరికొత్తగా అవకాడో సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు.సాధారణంగా అవకాడో వేడి తక్కువగా ఉండే చోట మాత్రమే సాగు చేస్తుంటారు. రాయలసీమ వంటి ప్రాంతంలో వేడి వాతావరణం ఎక్కువగా ఉంటుంది. అయినా సరే అవకాడో సాగు మొదలైంది. కడప జిల్లా లింగాల మండలం వెలిదండ్లకు యువ రైతు కర్ణవరదారెడ్డి అవకాడో సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. వేడి వాతావరణం ఉంటుందని తెలిసినా సరే వెనకడుగు వేయలేదు.. ధైర్యంగా అవకాడోను సాగు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితమే ప్లాన్ చేసి.. కర్ణాటకలోని కూర్గ్ దగ్గర అంటుకట్టి మొక్కల్ని తెప్పించారు. రైతు కర్ణవరదారెడ్డి తనకున్న రెండెకరాల పొలంలో ఎకరాకు 110 మొక్కల చొప్పున అవకాడో మొక్కల్ని నాటారు. నీటి కొరత లేకుండా బిందు సేద్యం చేశారు.. అంతేకాదు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువుల్ని ఉపయోగించారు. పంటకు ఎలాంటి తెగుళ్లు రాకుండా జాగ్రత్తగా నాలుగేళ్ల పాటూ చూసుకున్నారు. రైతు ఆదివారం రోజు కాయల్ని తొలిసారి కోశారు. ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి వచ్చిందని.. మరో ఐదు టన్నుల పంట కోయాల్సి ఉందని రైతు చెబుతున్నారు. కేజీ రూ.100 చొప్పున విక్రయించారు.. వ్యాపారులు నేరుగా కర్ణవరదారెడ్డి తోట దగ్గరకు వచ్చి కొనుగోలు చేయడం విశేషం. రైతు ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం పొందారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నా సరే రైతు మాత్రం వెనకడుగు వేయలేదు.. ధైర్యం చేసి అవకాడో సాగు చేసి లాభాలు అందుకున్నారు.ఇటీవల కడప జిల్లాకు చెందిన మరో రైతు బత్తాయి పంట సాగు చేసి రూ.కోటికిపైగా ఆదాయం పొందారు. అలాగే అనంతపురం జిల్లాలో ఆపిల్ సాగు చేసి మరో రైతు సక్సెస్ అయ్యారు.. ఆయనకు మంచి దిగుబడి వచ్చింది. రాయలసీమలో పరిస్థితులు మెల్లిగా మారిపోతున్నాయి. సరికొత్త ప్రయోగాలతో రైతులు సక్సెస్ అవుతున్నారు. ఈ రైతుల్ని ఆదర్శంగా తీసుకుని మరికొందరు కూడా సరికొత్త ఉద్యానవన పంటల్ని సాగు చేసే పనిలో ఉన్నారు.

# వి బీ గ్రాంజి చట్టాన్ని అమలు చేయొద్దు



హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి తెలంగాణ ఉపాధి హామీ హక్కుల వేదిక వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు తమ గళాన్ని వినిపించారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన 'వీబీ గ్రామ్ జీ' చట్టంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, దీనిని రాష్ట్రంలో అమలు చేయరాదని గట్టిగా డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి కూలీలకు లభించిన పని అడిగే హక్కు ను ఈ కొత్త చట్టం కాలరాస్తోందని, సంవత్సరంలో ఎప్పుడైనా పని అడిగే అవకాశాన్ని రద్దు

**రాష్ట్ర ప్రభుత్వం వీబీ గ్రామ్ జీ కు వ్యతిరేకంగా సుప్రీమ్ కోర్ట్ లో కేసు వేయాలి.**
**రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హక్కు కల్పిస్తూ చట్టాన్ని రూపొందించాలని**
**మంత్రివర్గ ఉప సంఘానికి తెలంగాణ ఉపాధి హామీ హక్కుల వేదిక వినతి.**

చేసి 60 రోజుల 'వర్క్ హాలిడే'ను ప్రవేశపెట్టడం కూలీల ప్రయోజనాలకు విరుద్ధమని ప్రజా సంఘాలు హెచ్చరించాయి. ముఖ్యంగా, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మేలు చేసే అభివృద్ధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఈ చట్టం ద్వారా రాష్ట్రాల పరిపాలనా స్వేచ్ఛను హరించి, కేంద్రం తన అదుపులో ఉంచుకోవాలని చూస్తోందని ప్రతినిధులు ఆక్షేపించారు. కేంద్రీయ ప్రాయోజిత పథకంగా దీనిని వర్గీకరించడం వల్ల, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను భరించినఅప్పటికి దాని ఘనత అంతా కేంద్రానికే దక్కుతుందని, దీనిని రాజకీయ ప్రతీకారంతో కేంద్రం రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా వాడుకునే ప్రమాదం ఉందని వారు విశ్లేషించారు. రాష్ట్రాలను కేవలం అమలు చేసే సంస్థలుగా మార్చివేసే ఈ చట్టంలోని పలు సెక్షన్లు, రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు. జనవరి 2 న తెలంగాణ అసెంబ్లీలో వీబీ గ్రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానానికి కట్టుబడి ఉండాలని, "ప్రజల ప్రభుత్వం"గా ప్రభుత్వం వర్ణిస్తున్నట్టుగా, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సొంతంగా కొత్త ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి గ్రామీణ కుటుంబాల ఉపాధి హక్కులను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం సిద్ధం చేసిన ముసాయిదా బిల్లును కూడా వారు ప్రభుత్వానికి అందజేశారు.

తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు ప్రజా సంఘాలను కలుపుకొని ప్రజాసంఘాల వాదనలను మంత్రివర్గ ఉప సంఘం సానుకూలంగా స్వీకరించింది. వీబీ గ్రామ్ జీ చట్టంలోని సెక్షన్ 30 ప్రకారం, కేంద్ర చట్టానికి అనుగుణంగా ఉంటూనే రాష్ట్రాలు తమ సొంత చట్టాలను రూపొందించుకుని, కేంద్రం నుండి 60 శాతం నిధులను పొందే వెసులుబాటు ఉందని, ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఉప సంఘం తెలిపింది. ఈ చట్టంలోని చట్టపరమైన లోపాలను విశ్లేషించి సుప్రీంకోర్టులో పోరాడేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, ఈ నెల 29న ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో, అన్ని రాష్ట్రాల పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రులతో జరగనున్న సమావేశంలో, పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క రాష్ట్రం తరపున ఈ చట్టంపై తీవ్ర వ్యతిరేకతను గట్టిగా వినిపిస్తారని మంత్రివర్గ ఉప సంఘం స్పష్టం చేసింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కతో పాటు గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్ మరియు ప్రజా సంఘాల నాయకులు పి. శంకర్, రుక్మి రావు ఆశాలత, కన్నెగంటి రవి, విస్సా కిరణ్, శ్రీ హర్ష, అఖిల్ సూర్య , శివలింగం, ఆర్. వెంకట్రాములు, మెట్ల శంకర్, పులి కల్పన, జీ.నరసింహా, గణిత, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల మధ్య కవిత చిచ్చు

హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగా, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయి పదేళ్లు దాటింది. పదేళు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కేంద్రం ప్రకటించింది. పునర్విభజన చట్టంలో చేరింది. దీంతో ఇంతకాలం విద్య, ఉద్యోగాల్లో తెలంగాణవారు ఆంధ్రాలో, ఆంధ్రావారు తెలంగాణలో పోటీ పడ్డారు. విభజన చట్టం ప్రకారం గడువు ముగిసింది. దీంతో ఇప్పుడు ఎవరి రాష్ట్రం వారిది. ఎవరి పాలన వారిది. ఎవరి కాలేజీలు వారివి, ఎవరి ఉద్యోగాలు వారిని ఈమేరకు తెలంగాణ కూడా అసెంబ్లీలో చట్టం చేసింది స్థానిక విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే దక్కాలని నిర్ణయించింది. ఇక 5 శాతం ఉద్యోగాల కోసం ఎవరైనా పోటీ పడొచ్చు. ఇలాంటి సమయంలో టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన)అధ్యక్షురాలు కల్వకుంట్ల రెండ రాష్ట్రాల మధ్య మళ్లీ చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు. 'ఆంధ్రాలో మన పిల్లలకు ఉద్యోగాలు ఇస్తారా? తెలంగాణలో ఆంధ్రా పిల్లలకు ఎందుకివ్వాలి?" అనే ప్రశ్నలు మళ్లీ వేడిని రాజేశాయి. రాష్ట్ర విభజన తర్వాత 12 ఏళ్లుగా కొనసాగుతున్న స్థానికత, నిరుద్యోగం, వనరుల పంపిణీ సమస్యలను లేవనెత్తుతున్నాయి. కవిత హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'తెలంగాణ స్థానికత ? సవాళ్లు' అనే రౌండ్ టేబుల్‌లో మాట్లాడుతూ, తెలంగాణలో ఇంజినీరింగ్ చదివిన ఇతర రాష్ట్రాల(ముఖ్యంగా ఆంధ్రా) విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడం అన్యాయమని అన్నారు. ఆంధ్రాలో తెలంగాణ వాళ్లను నాన్?లోకల్స్ అని పిలిచి ఉద్యోగాలు నిరాకరించినప్పుడు, తెలంగాణలో ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ముల్కీ రూల్స్‌ను పునరుద్ధరించాలని, గ్రూప్?1 వంటి నియామకాల్లో స్థానికులకు అన్యాయం జరిగిందని, హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ఏర్పాటు తర్వాత స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్‌ను బలపరుస్తున్నాయి. 1948 తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో ముల్కీ రూల్స్ అమలులో ఉండేవి. స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉండేది. 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఈ నిబంధనలు కొనసాగాయి. 1969, 1972లో జరిగిన ఉద్యమాలు స్థానికత సమస్యను మరింత తీవ్రం చేశాయి. 2014లో తెలంగాణ విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల పంపిణీ, ఆస్తుల విభజన, స్థానిక నిర్వచనం వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికతను నిర్దేశించే అధికారం రాష్ట్రాలకు ఉంది (భారత రాజ్యాంగం ఆర్టికల్ 16). కానీ కోర్టులు దీనిని న్యాయబద్ధంగా, అతిశయోక్తి లేకుండా అమలు చేయాలని నిర్ణయిస్తాయి. తెలంగాణ ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన కారణాల్లో ఒకటి "నీళ్లు, నిధులు, ఉద్యోగాలు. రాష్ట్ర వనరులు స్థానికులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని అనుకోవడం సహజం. నిరుద్యోగం అధికంగా ఉన్న పరిస్థితిలో ఇది మరింత సమర్థనీయం. ఒక రాష్ట్రం స్థానికులకు ప్రాధాన్యత ఇస్తే, మరొకటి కూడా అలాగే చేయవచ్చు. ఇది రాష్ట్రాల మధ్య సమతుల్యతను తీసుకురావచ్చు. రాష్ట్రాలు తమ ఉద్యోగ నియామకాల్లో నివాస అర్హత నిబంధనలు పెట్టుకోవచ్చు. అనేక రాష్ట్రాలు ఇలా చేస్తున్నాయి. కవిత వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య విభజన భావనను మరింత బలపరుస్తాయి. తెలుగు భాష, సంస్కృతి ఒకటే అయినప్పటికీ, మనోళ్లు.. పరాయోళ్లు అనే భావన పెరుగుతుంది. ఇది దీర్ఘకాలికంగా ఆర్థిక సహకారం, వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడిని దెబ్బతీస్తుంది. ఉద్యోగాలు కేవలం స్థానికత ఆధారంగా ఇవ్వడం వల్ల ప్రతిభావంతులైన యువతకు అవకాశాలు తగ్గవచ్చు. ప్రైవేట్ రంగం, కంపెనీలు ఇప్పటికే మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా సామర్థ్యం ప్రధానం కావాలి. కవిత వ్యాఖ్యలు తెలంగాణ యువత ఆందోళనలను బహిరంగంగా లేవనెత్తాయి. స్థానికులకు ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. అయితే ఇది రాజ్యాంగం, చట్టం, మెరిట్‌కు లోబడి ఉండాలి. రెండు రాష్ట్రాలు ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకోవడం కాకుండా, తమ తమ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలి. తెలుగు యువత ఒకటే. వారి భవిష్యత్తు రాజకీయ విభజనల్లో కాక, నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆర్థిక అభివృద్ధిలో ఉంది. ఆ దిశగా అందరూ కలిసి పని చేస్తేనే నిజమైన పరిష్కారం సాధ్యం.

## సెంటిమెంట్ విఫల వ్యూహం.. జనం లైట్ తీసుకుంటున్నారా?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ చిత్రపటంపై సరికొత్త వ్యూహాలు, సమీకరణాలు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ ప్రాంతీయవాదాన్ని పవన్ అవమానించారంటూ ఆయనపై దేశద్రోహం కేసులు పెట్టాలనే డిమాండ్ల వరకు కవిత వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ప్రస్తుతం తన రాజకీయ అస్తిత్వాన్ని, కొత్త పార్టీ ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చడం ద్వారా ప్రజాదరణ పొందవచ్చని ఆమె భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పొరుగు రాష్ట్ర నేత అయిన పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో, ఢిల్లీ లో చేసిన కొన్ని వ్యాఖ్యలను ఆమె తనకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. తెలంగాణవాదులను, ప్రాంతీయ అస్తిత్వాన్ని పవన్ కించపరిచారనే భావనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకోవాలనేది ఆమె అసలు స్కెచ్ .రాజకీయాల్లో ఒక పాపులర్ స్ట్రాటజీ ఉంది.. పెద్ద ఇమేజ్ ఉన్న నాయకుడిని లేదా సెలబ్రిటీని టార్గెట్ చేయడం ద్వారా చాలా తక్కువ సమయంలోనే వార్తల్లో నిలవవచ్చు. కవిత ప్రస్తుతం సరిగ్గా ఇదే ఫార్ములాను వాడుతున్నట్లు కనిపిస్తోంది. నిజానికి ఆమె ప్రధానంగా ఫైట్ చేయాల్సింది అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో లేదా తన పాత ఓటు బ్యాంక్ కలిగిన బీఆర్ఎస్‌తో. కానీ వారిని వదిలి, ఏపీలో తిరుగులేని పవర్‌తో దూసుకుపోతున్న పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా.. ఏమి సాధిస్తారన్నది ప్రశ్న. కవిత ఎంతగా విమర్శలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న అసలు వాస్తవం ఏమిటంటే తెలంగాణలో జనసేన రాజకీయ ప్రభావం దాదాపు శూన్యం. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సక్సెస్ తర్వాత హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన సరికొత్త ఆఫీసును ప్రారంభించినప్పటికీ, అది ఇంకా ఇక్కడ పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా ఎదగలేదు. అంతగా ప్రభావం లేని పార్టీ అధినేతను ఉద్దేశించి రోజూ ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల, కవిత తన స్థాయిని తగ్గించుకోవడమే కాకుండా.. అనవసరంగా జనసేనకు ఇక్కడ మైలేజ్ ఇస్తున్నారనే టాక్ వినిపిస్తోందిపవన్ కల్యాణ్ ఏదో అన్నారని, దాని చుట్టూ దేశద్రోహం కేసుల వరకు వెళ్లడం క్షేత్రస్థాయిలో ప్రజలను పెద్దగా ఆకట్టుకోవడం లేదు.

తెలంగాణ సమాజం ప్రస్తుతం నిరుద్యోగం, రైతుల రుణమాఫీ, స్థానిక సమస్యలు, కాంగ్రెస్ పాలన వంటి అంశాలపై చర్చించుకుంటోంది. అంతే తప్ప ఏపీ నేత తెలంగాణ గురించి ఏం మాట్లాడారనే అంశంపై సామాన్యులకు పెద్దగా ఆసక్తి లేదు. ఫలితంగా కవిత చేస్తున్న ఈ విమర్శలు సోషల్ మీడియాలో ట్రోల్స్, కౌంటర్ అటాక్స్‌కు పరిమితం అవుతున్నాయి తప్ప.. ఓటర్ల మధ్య ఒక సీరియస్ చర్చకు దారితీయడం లేదు. ఒక కొత్త ప్రాంతీయ పార్టీగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్లాలంటే కేవలం డైవర్షన్ పాలిటిక్స్ లేదా పొరుగు రాష్ట్ర నేతలపై విమర్శలు సరిపోవని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలోని గూడాలలో, పల్లెల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై లేదా స్థానిక సమస్యలపై పోరాడితేనే కవితకు మైలేజ్ వస్తుంది. లేదంటే పవన్‌ను టార్గెట్ చేసే ఈ వ్యూహం కేవలం డిబేట్లకే పరిమితమై, రాజకీయంగా ఆమెకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చకపోవచ్చు.

## గుంటూరు జిల్లాలో మంచికలపూడి ఆర్‌యూబీ పనులు ప్రారంభం

గుంటూరు : గుంటూరు జిల్లాలోని మంచికలపూడి ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రైల్వే గేటు కారణంగా వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమయ్యేవారు. ఈ నేపథ్యంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించి.. గురువారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆరు నెలల పాటు మంచికలపూడి గేటు మూసివేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని సూచిస్తున్నారు. గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేరనుంది. మంచికలపూడి మార్గంలో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. మంచికలపూడి మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే గేటు కారణంగా వాహనాల రద్దీ నెలకుంటోంది. రైలు వెళ్లే సమయంలో గేటు వేస్తుండటంతో రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ఒకసారి గేటు పడితే గంటపాటు ఎదురుచూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు మరో ఆరు నెలల్లో పరిష్కారం లభించనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, రైలు మార్గాలు వంటి మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పలుచోట్ల రహదారి అభివృద్ధి పనులు, విస్తరణ, మరమ్మతు పనులు చేపడుతున్నారు. అలాగే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు కూడా ముందుకు కదులుతున్నాయి. ఈ క్రమంలోనే మంచికలపూడి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పనులు ఆరు నెలల పాటు కొనసాగుతాయని అధికారులు చెప్తున్నారు. దీంతో అప్పటి వరకూ గేటు మూసే ఉండనుంది. అలాగే గేటుకు కొద్దిగా ముందు రహదారికి గండికొట్టారు. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి అయ్యే వరకూ కె.ఆర్ కొండూరు, మంచికలపూడి గ్రామాలకు వెళ్లాలంటే దుగ్గిరాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మరోవైపు కే. ఆర్. కొండూరు, దుగ్గిరాల పెట్రోల్ బంకుల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ పనులు ప్రారంభమైనట్లుగా బోర్డులు పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాంటి బోర్డులేవీ లేకపోవటంతో గేటు దాకా వెళ్లి.. పనులు జరుగుతున్న నేపథ్యంలో తిరిగి వెనక్కి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. అలా కాకుండా ముందే బోర్డుల ద్వారా సమాచారం అందిస్తే వాహనదారులకు ఉపయోగం ఉంటుందని చెప్తున్నారు. మంచికలపూడి గేట్ తరహాలోనే చిలువూరు, దుగ్గిరాల గేట్ల విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దుగ్గిరాల వద్ద మరో రైల్వే లైన్ ఏర్పాటు కానున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో దుగ్గిరాల, చిలువూరు గేట్ల విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అప్పుడే ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని.. ఇలా గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదని చెప్తున్నారు. మంచికలపూడి ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభం కావటంతో మరో ఆరు నెలల్లో సమస్యకు కొద్దిగా పరిష్కారం లభిస్తుందని.. దుగ్గిరాల, చిలువూరు విషయంలోనూ చర్యలు తీసుకుంటే పూర్తిస్థాయిలో ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు చెప్తున్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని



అమరచింత : అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో .. సకాలంలో వర్షాలు కురవాలని డోలు చప్పులతో ఊరేగింపుగా రైతులు ట్రాక్టర్ల పై కృష్ణా నదిలో పూజలు చేసి నదిలోని నీటిని తీసుకురావడానికి బయలుదేరారు. నీటిని తీసుకువచ్చిన అనంతరం గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాల్లో ఉన్న దేవి దేవతలకు అభిషేకం చేస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని పంటలు బాగా పండుతాయని. రైతులు యొక్క నమ్మకాన్నివ్యక్తం చేశారు.

## జ్యువెలరీ షోరూమ్ లో రౌడీల వీరంగం


హైదరాబాద్ : బంజారాహిల్స్ జ్యువెలరీ షోరూమ్లో రౌడీ షీటర్ వీరంగనీ సృష్టించాడు. బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసాడు. పోలీసులు అలీమ్, యూనస్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసారు. రోడ్ నం.10లోని శ్రీ సాయి జగదాంబ పెరల్స్ అండ్ జ్యువెలర్స్ షోరూమ్లో ఘటన జరిగింది. మద్యం మత్తులో వచ్చి మేనేజర్ను బెదిరించారని ఫిర్యాదు. మేనేజర్ ను కత్తితో బెదిరించి లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. నెక్స్ట్ టైమ్ వచ్చినప్పుడు డబ్బు రెడీ గా ఉంచాలని బెదిరింపులకు గురిచేసారు. తనకు, సిబ్బందికి ప్రాణహాని ఉందని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని మేనేజర్ పంకజ్ బండ్గర్ ఫిర్యాదు చేసాడు. మేనేజర్ ఫిర్యాదుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు. అలీమ్, యూనస్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

మేడ్చల్ : గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న మేడ్చల్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై మేడ్చల్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ అలియాస్ నితిన్ అలియాస్ ఆకాష్ (24), రాజేష్ మాధవ్ చౌదరి (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధ్రువ కళాశాల రోడ్డు, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.06 సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి మేడ్చల్‌లో అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపరచగా, గంజాయి సరఫరా మూలాలు మరియు ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్‌కు సంబంధించిన ఇతర వ్యక్తుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల బాట..

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలపై ఈ విద్యా సంవత్సరంలో తల్లిదండ్రుల విశ్వాసం గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లడం సాధారణంగా కనిపించేది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా మారింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం విద్యారంగంలో కొత్త మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం లక్షకు పైగా విద్యార్థులు ప్రభుత్వ బడులను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ చేరికల పెరుగుదలకు ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రధాన కారణంగా నిలిచాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా 'బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వల్ల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన గురించి ప్రజలకు వివరించడం కూడా సానుకూల ఫలితాలను ఇచ్చిందని చెబుతున్నారు. అంతేకాకుండా 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించడం ద్వారా తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేశారు. పిల్లల చదువు, పాఠశాల నిర్వహణ, అవసరమైన వసతులపై నేరుగా అభిప్రాయాలు తెలుసుకోవడం వల్ల పరస్పర నమ్మకం పెరిగింది. ఈ విధానం ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మంచి అభిప్రాయాన్ని తీసుకువచ్చిందని అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులు కూడా చాలా కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దీంతో నాణ్యమైన విద్యతో పాటు తక్కువ ఆర్థిక భారం ఉండే ప్రభుత్వ పాఠశాలలను చాలా మంది తల్లిదండ్రులు ఎంచుకుంటున్నారని తెలుస్తోంది.



# శ్రీదేవీ రమణీయం

**స్నేహం’ అనగానే ప్రేక్షకులకు, సాహిత్యాభిమానులకు బాపు-రమణ ఎలా గుర్తుకొస్తారో, దాంపత్యం అంటే వారి సన్నిహితులకు రమణ-శ్రీదేవి గుర్తుకొస్తారు. శ్రీదేవి... శ్రీమతి ముళ్లపూడి వెంకటరమణ. ఆయన రచనలకు తొలి పాఠకురాలు. వాటిని తన దస్తూరితో తిరగరాసిన అభిమాని. అంతేకాదు బాపు-రమణల గురించి ‘నెమరేసిన మెమొర?స’లో ఆమె వెల్లడించిన విశేషాలతోనూ స్వయంగా రాసిన ‘రమణీయ శ్రీరామాయణం’, ‘రమణీయ శ్రీభాగవతం’లో ప్రదర్శించిన శైలీ విన్యాసంతోనూ రచయిత్రి గానూ ‘రమణగారి అర్ధాంగి’ అనిపించారు. ముళ్లపూడివారి 95వ జయంతి సందర్భంగా ఆమె పంచుకున్న జ్ఞాపకాలివి.**

**(సమయం ప్రతినిధి):** “మా అన్నయ్య నండూరి రామ్మోహనరావు మద్రాసులో ఆంధ్రపత్రికలో పనిచేస్తూ ఉండేవాడు. ఇంటికి వచ్చినప్పుడు పత్రిక గురించి, రచయితల గురించి కబుర్లు చెబుతూ ఉండేవాడు. ముళ్లపూడి వెంకట రమణ గారివి, ఇతర రచయితలవి పుస్తకాలు పట్టుకొచ్చి ఇస్తూ ఉండేవాడు. నాకు 14 ఏళ్లు ఉన్నప్పుడు– మా అన్నయ్యల పెళ్లిళ్లు పది రోజుల తేడాలో జరిగాయి. ఆ పెళ్లికి వచ్చిన మా చుట్టం ఒకావిడ– “ఆంధ్ర పత్రికలో బుడుగు కార్టూన్లు వస్తున్నాయి. చదువుతున్నావా? పేర్లు వేయటం లేదు కానీ రాస్తున్నది మాత్రం ముళ్లపూడి వెంకట రమణే!” అంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. రచయిత పేరు లేకపోయినా– రాసే తీరును బట్టి ఎవరు రాశారో చెప్పేస్తున్నారంటే– పాఠకుల్లో రమణగారికి ఎంత ఆదరణ ఉందో అర్థమయింది. ఆ తరువాత ఆయన రాసిన కథలన్నీ చదివేదాన్ని. నేను చదవటమే కాదు, మా అమ్మని, బామ్మని, పక్కింటావిడని కూర్చోబెట్టి చదివి వినిపించేదాన్ని. వాళ్లు పొట్ట చెక్కలయ్యేలా నవ్వేవాళ్లు.

### దస్తూరి బావుండకే...

రమణగారితో పెళ్లి అయిన తర్వాత మద్రాసు వెళ్లిపోయాను. రమణగారి దస్తూరి అంత బావుండదు. ఒకసారి చదివి అర్థం చేసుకోవటం కష్టం. ఒకసారి ఆయనో సీన్ రాసి చదివి ఎలా ఉందో చెప్పమన్నారు. “మీ రైటింగ్ అర్థం కావట్లేదు” అన్నాను. “దాన్ని అర్థం చేసుకుని ఫెయిర్ కాపీ చేసి పెట్టు. రేపు ప్రొడ్యూసర్‌కో, పబ్లిషర్‌కో చూపిస్తే వారికి అర్థం కావాలి కదా” అన్నారు. నా ఫెయిర్ కాపీల ప్రస్థానం అలా మొదలయింది. నేను ఫెయిర్ చేయకముందు– బాపుగారు లాంటి మిత్రులు ఫెయిర్ కాపీ చేసేవారు. ఆ తర్వాత మొత్తం బాధ్యతంతా నాదే! రమణగారు రాసింది రాసినట్లు ఫెయిర్ చేసేదాన్ని. పదాలేవైనా అర్థం కాకపోతే వివరంగా అడిగి తెలుసుకొనేదాన్ని. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. రమణగారు తాను రాసిన వాటిని– కథలైనా, స్క్రిప్టులైనా, పాటలైనా ముందు బాపుగారికి చూపించేవారు. ఆయన ‘ఓకే’ అన్న తర్వాతే నా దగ్గరకు వచ్చేవి. అదే విధంగా బాపు గారు ఏదైనా బొమ్మ వేస్తే రమణ గారికే చూపించేవారు. ఆయన ‘ఓకే’ అన్న తర్వాత ఫైనల్ అయ్యేవి. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం అంత గట్టిది.. గొప్పది! ఇద్దరూ ఒకరికొకరు అన్నట్లు పనిచేసేవారు.. జీవించేవారు. అలాంటి స్నేహితులు చాలా అరుదుగా ఉంటారు.

### వంటబట్టలేదు...

నాకు రమణ రచనలంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. ఆ తర్వాత ఆయన రాసిన ప్రతి వాక్యాన్ని ఫెయిర్ చేశా! అయితే నాకు ఈ చదవటం, ఫెయిర్ చేయటం ద్వారా ఎటువంటి అక్షర జ్ఞానం వంటబట్టలేదు. ఆయన రచనలను బేరీజు వేసేటంత జ్ఞానం కూడా నాకు లేదు. నా జీవితంలో నేను ఎప్పుడూ ఏదైనా రాస్తానని కూడా అనుకోలేదు. కానీ నేను పుస్తకాలు రాయటమనేది చాలా యాదృచ్ఛికంగా జరిగింది. మా అమ్మాయి అమెరికాలో ఉంటుంది. తనతో నేను రోజూ మాట్లాడుతూ ఉంటాను. మాటల సందర్భంలో చిన్ననాటి సంగతులు, ఊరి విశేషాలు, మా అన్నయ్యలు, అక్కల గురించి ఏవేవో పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చినవన్నీ చెబుతుంటాను. ఒక రోజు మా అమ్మాయి– “అమ్మా నీకిన్ని సంగతులు గుర్తున్నాయి కదా! ఈ కబుర్లన్నింటినీ ఓ పుస్తకంగా రాయొచ్చు కదా” అంది. రాయటం నాకు కొత్త కాదు కదా! గుర్తుకొచ్చినవన్నీ రాయటం మొదలుపెట్టా! అలా పుట్టినవే నా పుస్తకాలు. వీటిలో నా జ్ఞాపకాల పుస్తకానికి మా అబ్బాయి వర– ‘నెమరేసిన మెమొరీస్’ అని పేరు పెట్టాడు. ఆ పుస్తకంలో వాక్య నిర్మాణం బాగా కుదిరింది. అది నా స్టయిల్‌లోనే ఉంటుంది తప్ప రమణ గారు రాసినట్లు ఉండదు. రమణగారు క్లుప్తంగా ఎంత వరకూ అవసరమో అంత వరకు మాత్రమే రాస్తారు. నాకు అలా రాయటం రాదు. నాది సాగదీత ధోరణి. అందుకే మా కోడలు– “మీరు ఎక్కువగా రాస్తారు” అంటూ ఉంటుంది.

### వెంకన్నను చూడకుండానే..

ఒకసారి పిల్లలతో కలిసి కార్లో తిరుపతికి బయలుదేరాం. మధ్యలో తిరుచానూరు దగ్గర ఆగి చెట్ల కింద కూర్చుని సరదాగా గడిపాం. ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్లు తినేసి తిరుపతికి వెళ్లాం. దేవుడి దర్శనానికి పెద్ద క్యూ కనిపించింది. అది చూసి రమణ గారు ఈ జనంలో నేను దేవుడిని దర్శనం చేసుకోలేను వెళ్లిపోదాం పద అన్నారు. ఇంత దూరం వచ్చి దేవుడిని చూడకుండా ఎలా అన్నా కూడా ఆయన వినలేదు. ఆయన మాట ప్రకారమే ఇంటికి బయలుదేరాం. కొండ



దిగుతుంటే కారు ఆగిపోయింది. మెకానిక్ వచ్చి రిపేర్ చేసేటప్పటికి గంటన్నర పట్టింది. అంతసేపు చెట్ల కిందే కూర్చున్నాం. అదే సమయం కొండమీద ఉండినట్లయితే దేవుడిని చూసేవాళ్లం కదా అనుకున్నాం.

### ఇద్దరూ సర్దుకుంటేనే...

మాది ఉమ్మడి కుటుంబం. రమణగారికి ఓపిక ఎక్కువ. నేను కూడా ఓర్పుగానే ఉండేదాన్ని. నేను చెప్పింది ఆయన వినేవారు. ఆయన చెప్పింది నేను వినేదాన్ని. గట్టిగా మాటా మాటా అనుకున్న సందర్భాలేవీ లేవు. రమణగారిది స్నేహ స్వభావం. నెమ్మదిగా చక్కగా మాట్లాడతారు. పిల్లలపై కూడా ఎప్పుడూ కోపగించుకున్నది లేదు. పొద్దుటిపూట ఆయన పేపర్ చదువుకొనే సమయంలో కుటుంబ సభ్యులంతా వచ్చి కూర్చుని సరదాగా మాట్లాడుతుండేవాళ్లు. ఆయన అవన్నీ వింటూ, మధ్య మధ్యలో మాటలు కలుపుతూ జోక్స్ వేస్తూ గంటసేపు హాయిగా గడిపేవారు. అలాగే సాయంత్రం పూట ఆయన ఎక్కడ ఉంటే అక్కడ మా అత్తగారు, బాపు గారి తల్లి, మా ఆడపడుచు, మా పిల్లలు అందరూ చేరి బోలెడు కబుర్లు చెప్పుకునేవారు. ఇంటికి బంధు మిత్రులు ఎవరు వచ్చినా వాళ్లతో గంటలు గంటలు మాట్లాడుతుండేవారు. ఆయనకు స్నేహితులు కూడా ఎక్కువే. చిన్నప్పుడు మద్రాసులో చదువుకునేటప్పుడు, సినిమాల్లోకి వచ్చాక కూడా మంచి స్నేహితులు ఉండేవారు. అందరూ కలిసి సంతోషంగా గడుపుతూ ఉండేవారు.

### విడదీయలేని స్నేహం...

మా పెళ్లికి ముందే రమణగారికి బాపుగారితో మంచి స్నేహం ఉండేది. నేను బాపు గారిని మొదటిసారి చూసింది మా పెళ్లిలోనే! మా అన్నయ్య నండూరి రామ్మోహనరావు... ‘ఆంధ్ర పత్రిక’లో పనిచేసేటప్పుడు మద్రాసులో బాపుగారింట్లో అద్దెకు ఉండేవారు. అన్నా వదిన సెలవులకు మా ఊరు వచ్చినప్పుడు... బాపుగారు, ఆయన భార్య భాగ్యవతి.. ఆయన తమ్ముళ్ల గురించి చాలా సంగతులు చెబుతుండేవారు. దీంతో వాళ్లెవరినీ నేను చూడకపోయినా... నాకు బాగా తెలిసిన వ్యక్తుల్లా అనిపించేవారు. ఇక పెళ్లయి మద్రాసుకు వెళ్లిన తర్వాత బాపుగారిది, మాది పక్కపక్క ఇళ్లే. దాంతో బాపుగారి భార్య భాగ్యవతి మా ఇంటికి తరచూ వస్తుండేది. భాగ్యవతి చిన్నప్పటి నుంచీ మద్రాసులోనే పెరిగింది. ఆమెది పెద్ద కుటుంబం. ఆమెకు మద్రాసులో చాలామంది బంధుమిత్రులు ఉండేవారు. నేను పల్లెటూరినుంచి రావటం వల్ల మద్రాసు గురించి నాకు ఏమి తెలీదు. కొద్ది కాలంలోనే తాను నాకు మంచి స్నేహితురాలైంది. మద్రాసును నాకు పరిచయం చేసింది తనే! మా పిల్లల స్కూల్ అడ్మిషన్స్ నుంచి వాళ్ల యూనిఫామ్‌ల దాకా అన్నీ తనే చూసుకొనేది. సాయంత్రంపూట పిల్లలను బీచ్‌కు తీసుకెళ్లి ఆడించేది. సెలవులప్పుడు సర్కసలకు, ఎగ్జిబిషన్లకు, సినిమాలకు తిప్పేది. నేను ఇల్లు కదిలితే... భాగ్యవతితోనే. ఆమె నాకు మంచి గైడ్‌లా ఉండేది. వాళ్లింట్లో పెళ్లిళ్లకు మేము, మా ఇంటి శుభకార్యాలకు ఆమె చుట్టాలతో సహా వెళ్లే వాళ్లం. బాపు, రమణ ఎంత మంచి స్నేహితులో మేమిద్దరం కూడా అలాగే ఒకరికొకరం అండగా ఉండేవాళ్లం. భాగ్యవతికి ఇతరులకు సాయం చేసే గుణం ఎక్కువ! ఏ సమయంలోనైనా, ఎవరికి ఏ సహాయం కావాలన్నా నేనున్నానంటూ చేసిపెట్టేది. అవసరమైతే అర్ధరాత్రి అయినా సరే... కార్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మరీ పిలిపించేది.

ఆమె ఎంత కలివిడిగా ఉండేదో... బాపు గారికి అంత మొహమాటం! ఆడవాళ్ల దగ్గరైతే మరీను. అవసరం మేరకు మాత్రమే మాట్లాడేవారు. నేను కూడా బాపు గారితో మాట్లాడింది లేదు. మా పిల్లలు బాపుగారి దగ్గర, బాపుగారి పిల్లలు రమణగారి దగ్గర ఎక్కువ చనువుగా ఉండేవారు. “మామా, మామా” అంటూ వాళ్లకు కావాల్సిన పనులు చేయించుకునేవారు.

### వాళ్లు మాత్రమే ఇంటికి వచ్చేవారు

రమణగారు ఎక్కువగా బాపుగారింట్లోనే చర్చలు జరుపుతుండేవాళ్లు. ఇద్దరూ సినిమా సన్నివేశాల గురించి మాట్లాడుకునేవాళ్లు. ఆ సమయంలో పిల్లలతో సహా ఎవరూ వాళ్లని డిస్ట్రబ్ చేసేవాళ్లు కాదు. ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చి పడుకునేవారు. ఏవైనా అభిప్రాయ బేధాలు వస్తే ఒకరికొకరు క్షమాపణలు చెప్పుకునేవారు. వాళ్ల వర్క్‌కు సంబంధించిన టెన్షన్లను ఇంట్లో చూపించేవారు కాదు. ఇంటికి దగ్గరలోనే మాకు ‘చిత్ర కల్పన’ ప్రొడక్షన్ ఆఫీస్ ఉండేది. ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, స్నేహితులు అంతా అక్కడికే వచ్చేవారు. మా ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయిన శ్రీరమణ, శంకు, ఎమ్వీఎల్, వి.వి.సుబ్బారావు, కొండలరావు లాంటివారు మాత్రం మా ఇంటికి వచ్చేవారు.

### నచ్చిన కథ

రమణగారు రాసినవాటిలో ‘కానుక’ కథ అంటే నాకు చాలా ఇష్టం. విచిత్రమేమిటంటే ఆ కథ ఆయన రాశారనే విషయం నాకు చాలాకాలం తెలియదు. ఆయన ఆ కథను పెన్ నేమ్‌తో




రాశారు. ఆ కథ నాకు చాలా నచ్చింది. నా పెళ్లి అయిన తర్వాత ఈ కథను ఒక సంకలనంలో ముద్రించారు. అప్పుడు అది రాసింది ఆయనేఅని తెలిసింది.

### షూటింగ్‌లు ఇష్టం ఉండేవి కాదు

సినిమా షూటింగ్‌లు చూడడానికి ఎక్కువగా వెళ్లేవాళ్లం కాదు. వాహినీ స్టూడియోలో ఏదో సినిమా షూటింగ్ జరుగుతుంటే ఒకసారి వెళ్లాం. అలాగే ఒకసారి గిండీకి వెళ్లాం. అప్పట్లో రాజమండ్రిలో గోదావరి చుట్టుపక్కల అవుట్‌డోర్ షూటింగ్స్ ఎక్కువగా జరుగుతుండేవి. ఆ ఊళ్లో బాపు, రమణల చిన్ననాటి మిత్రుడు బి.వి.ఎస్.రామారావు ఉండేవారు. ఆయన ఇరిగేషన్ ఇంజనీరు. పిల్లలకు స్కూలు సెలవులప్పుడు వారింట్లో ఉండి కొన్ని షూటింగ్‌లు చూసేవాళ్లం. అలాగే ఆయన ఏర్పాటు చేసిన లాంచ్ మీద తిరగడం, భద్రాచలం వెళ్లడం సరదాగా ఉండేది. అంతే తప్ప, షూటింగ్‌కి పిల్లల్ని తీసుకెళ్లడం రమణగారికి ఇష్టముండేది కాదు. పిల్లలు కూడా ఆసక్తి చూపేవారు కాదు.

### ముందు ఆలోచించుకొని...

రమణగారు ఉదయాన్నే లేచి గంటసేపు వాకింగ్‌కు వెళ్లేవారు. తరువాత ఇంటికి వచ్చి కాఫీ తాగి పేపర్ చదువుకునేవారు. స్నానం చేసి టిఫిన్ తిన్న తరువాత రాసుకోవడానికి సిద్ధమయ్యేవారు. వరండాలోనో, బాల్కనీలోనో, గదిలోనో కూర్చుని ప్యాడ్, పేపర్ పట్టుకుని గంట లేదా గంటన్నర సేపు రాసుకునేవారు. ఇక రోజంతా రాసే పని పెట్టుకునేవారు కాదు. వాకింగ్ చేసేటప్పుడే ఈరోజు ఏమి రాయాలి? ఎలా రాయాలి? అనేవాటిని ఆలోచించుకునేవారు. మధ్యాహ్నం 12 గంటలలోపు గబగబా రాసేసేవారు. తరువాత భోజనం చేసి పడుకొని లేచేసరికి నాలుగయ్యేది. కుటుంబ సభ్యులతో కాసేపు కబుర్లు చెప్పి పుస్తకాలు చదువుకొనేవారు. లేదంటే బాపుగారి దగ్గరకు వెళ్లేవారు.

---

# న్యాయ ప్రవక్త దెబోరా



**(సమయం ప్రతినిధి):** ఉషోదయం, పక్షుల కిలకిలలు ఉదయించబోతున్న సూర్యుడికి ఆహ్వాన లేఖలు పంపుతాయి. ఇవి మంగళకరమైన మహోదయానికి సూచనలు. అలాగే క్రీస్తు ఉదయించడానికి ముందు కొన్ని సూచనలు వెలువడ్డాయి. అవి అందుకున్నవారు ప్రవక్తలు. వారిలో మహిళలూ ఉన్నారు. న్యాయాధిపతులదే అంతిమ నిర్ణయమైన ఇశ్రాయేలీయుల కాలంలో... వారందరినీ తల్లిలా అక్కున చేర్చుకున్న మహిళా న్యాయ ప్రవక్త దెబోరా. దైవానుగ్రహంతో ఆమె ఇశ్రాయేలీయులకు దిశానిర్దేశం చేసింది. ఆమెకు సింహాసనం, హంగు, ఆర్భాటం లాంటివి ఏవీ లేవు. ఒక ఖర్జూర వృక్షం నీడలో కూర్చొని... ప్రజలకు హితోపదేశం చేస్తూ ఉండేది. ప్రజలు నైతికత మరచినప్పుడల్లా దేవుడు వారికి కష్టనష్టాలు కలిగించేవాడట. అలా ఇశ్రాయేలీయులు కూడా శత్రువుల పాలనలో బానిసలుగా ఉండిపోయేరు. అప్పటికే ఇరవై ఏళ్ళ నుంచి సీసెరా అనే దుష్టరాజు పాలిస్తూ... వారిని బాధలకు గురిచేసేవాడు. కఠినంగా అణచివేసేవాడు. తమ బాధల్ని యెహోవాకు ఇశ్రాయేలీయులందరూ మొరపెట్టుకోగా... దెబోరాను వారికి చూపించాడు. ఆమె దైవమార్గాన్ని ఉపదేశిస్తూ, మహా సేనానులుగా తీర్చిదిద్దింది.

సీసెరా దుష్టుడు, బలవంతుడు. అతనికి ప్రత్యర్థిగా ఇశ్రాయేలీయుల్లో బలహీనుడైన బారాకు... కేవలం పదివేలమందితో యుద్ధానికి సిద్ధమయ్యేడు. ఆ సమయానికి తాబోరు కొండల్లో తలదాచుకున్న బారాకును దెబోరా చైతన్య పరచింది. “యెహోవా వేంచేసి ఉన్నాడు. ఆ సీసెరాను నీ చేతికి అప్పగిస్తాడు. నువ్వు నిమిత్రమాత్రుడివి. నీ పక్షాన యెహోవాయే యుద్ధం చేస్తాడు. రా! ధైర్యంగా పోరాడు” అని ఉద్బోధించింది. ఆమె సూచనల మేరకు పదివేలమందితో తాబోరు కొండ మీద బారాకు నిలిచి ఉన్నాడు. సిసేరా 400 ఇనుప రథాలతో హూంకరిస్తూ వచ్చాడు. దేవుడు వాగులు, వంకల్లో వరదల్ని రప్పించి అతని సేనలకు ఆటంకం కలిగించాడు. చివరికి ఓటమిపాలు చేశాడు. బారాకు విజేత అయ్యాడు. ఈ కార్యం అంతటినీ దెబోరా ద్వారా దేవుడు నెరవేర్చాడు. బైబిల్‌లో ఆమె న్యాయచింతన, ప్రగాఢభక్తి లాంటి సద్గుణాలతో కనిపిస్తుంది. ‘దెబోరా’ అంటే... తేనెటీగ. తేనెటీగలా కష్టపడేది, తెలివైనది, సమాజానికి ఉపయోగపడేది అని అర్థం.

# సింహపురిలో అనిల్ మిస్సింగ్

నెల్లూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివాదాస్పద నేతలంతా యాక్టివయ్యారు. ఒకే ఒక్కరు తప్ప. ఆయనే మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల, జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయతతో వ్యవహరించే అనిల్ కుమార్ యాదవ్ కొద్దిరోజులుగా కనిపించడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. తాడేపల్లి సైతం దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే ఆయన రాజకీయాలకు దూరమవుతారా? లేకుంటే వైసీపీకి దూరమయ్యారా? అన్నది మాత్రం తెలియడం లేదు. కొడాలి నానితో పాటు వల్లభనేని వంశీ లాంటి వారు కూడా ఆక్టివ్ అయ్యారు కానీ.. అనిల్ జాడ లేకపోవడం నిజంగా చర్చకు దారితీస్తోంది.వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహించిన నేతల్లో అనిల్ కుమార్ యాదవ్ ఒకరు. 2009లో ఆనం బ్రదర్స్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు అనిల్ కుమార్ యాదవ్. స్వల్ప ఓట్ల తేడాతో ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టడంతో ఆ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి వైసీపీ నుంచి గెలిచిన అనిల్ ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికల్లో మాత్రం నెల్లూరు అసెంబ్లీ సీటు ఇవ్వలేదు. నరసరావుపేట పార్లమెంటు సీటును ఇచ్చారు. టిడిపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయల చేతిలో ఓడిపోయారు. అక్కడ నుంచి కనిపించకుండా మానేశారు అనిల్ కుమార్ యాదవ్వైసీపీలో దాదాపు నేతలంతా క్రియాశీలకం అయ్యారు. అనిల్ కుమార్ యాదవ్ మాత్రం నెల్లూరులో చిన్న చిన్న ప్రెస్ మీట్ లు పెట్టి జారుకుంటున్నారు. అయితే ఇప్పటికే నెల్లూరు సిటీ బాధ్యతలను ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. ఆ నిర్ణయం నచ్చక అనిల్ కుమార్ యాదవ్ నెల్లూరు వైపు రావడం లేదన్న ప్రచారం ఉంది. మరోవైపు ఇతర రాష్ట్రాల్లో ఆయన వ్యాపారాలు చేసుకుంటున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. అనిల్ కుమార్ యాదవ్ తీరుతోనే నెల్లూరులో తనకు ఎంతో నమ్మకస్తులైన నేతలను వదులుకున్నారు జగన్. ఇప్పుడు కష్టంలో ఉండగా ఈ మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా జగన్ పక్కన నిలబడకపోవడం అనేది పొలిటికల్ వర్గాల్లో ఆశ్చర్యం వేస్తోంది. అసలు అనిల్ కుమార్ యాదవ్ తిరిగి యాక్టివ్ అవుతారా? లేదా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే జగన్మోహన్ రెడ్డి నెల్లూరు విషయంలో అనిల్ కు షరతు పెట్టడం వల్లే.. పార్టీకి దూరంగా ఉంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత నిజం ఉందో చూడాలి.




# టీనేజ్ పిల్లలకి తల్లిగా కెజిఎఫ్ బ్యూటీ..

ఇండస్ట్రీ.. ఒకప్పుడు ఉన్నట్లు ఇప్పుడు లేదు అంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు హీరోయిన్లు కేవలం గ్లామర్ పాత్రల్లోనే ఎక్కువగా కనిపించేవారు. పెళ్లి అయ్యాకా.. పిల్లలు పుట్టాక మాత్రమే తల్లి, అత్త, అక్క పాత్రల్లో కనిపించేవారు. ఎందుకంటే ముందే అలాంటి పాత్రల్లో కనిపిస్తే.. ఇక కెరీర్ మొత్తం అలాంటి పాత్రలే వస్తాయని భయపడేవారు. కానీ, జనరేషన్ మారింది.. ఇండస్ట్రీ కూడా మారుతూ వస్తోంది.. డైరెక్టర్లు సైతం వారిని గ్లామర్ డాల్స్ గా కాకుండా కథను మలుపు తిప్పే వెపన్స్ గా వాడుతున్నారు. అలానే హీరోయిన్లు కూడా మారుతున్నారు. కథను బట్టి ఎలాంటి పాత్రకు అయినా ఓకే చెప్పేస్తున్నారు. పెళ్లి కాకముందే సినిమాల్లో తల్లులుగా నటించి మెప్పిస్తున్నారు. మొన్నటికి మొన్న సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో ఐశ్వర్య రాజేష్.. నలుగురు పిల్లలకు తల్లిగా నటించి షాక్ ఇచ్చింది. తన వయస్సుకు మించిన పాత్ర అయినా కూడా ఆమె నటనతో సినిమా సక్సెస్ కి కారణం అయ్యింది. ఇక ఇప్పుడు ఆమెలానే మరో బ్యూటీ ఇద్దరు పిల్లల తల్లిగా కనిపించనుంది. ఆ బ్యూటీ ఎవరో కాదు.. శ్రీనిధి శెట్టి. కేజీఎఫ్ సిరీస్‌తో పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి.. తెలుగులో తెలుసు కదా సినిమాతో అడుగుపెట్టినా.. దానికి ముందు హిట్ 3 సినిమా రిలీజ్ అవ్వడంతో టాలీవుడ్ లో మొదటి అడుగు హిట్ తోనే పెట్టింది. దీని తరువాత ఆచితూచి అడుగులు వేస్తోన్న ఈ భామ.. గురూజీ చేతిలో పడింది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ల కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం ఆదర్శ కుటుంబం. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమాపై అంచనాలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ క్రేజీ ఫ్యామిలీ డ్రామాను రాబోయే అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ ఒక పోస్టర్ ని రిలీజ్ చేసింది. ఆ పోస్టర్‌లో హీరోయిన్ శ్రీనిధి శెట్టి లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు సినిమా విశ్లేషకులు మాత్రం త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ స్క్రిప్ట్‌లలో పాత్రల వెనుక ఎప్పుడూ ఒక బలమైన ఎమోషన్, పెద్ద ట్విస్ట్ దాగి ఉంటాయని, శ్రీనిధి శెట్టి కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఒక నటిగా తనను తాను నిరూపించుకోవడానికే ఈ ఛాలెంజింగ్ రోల్‌ను ఒప్పుకొని ఉంటుందని అంటున్నారు. వెంకటేష్ ఫ్యామిలీ ఇమేజ్‌కు, త్రివిక్రమ్ పవర్‌ఫుల్ డైలాగ్స్‌కు తోడు శ్రీనిధి శెట్టి పాత్రలోని ఇంటెన్సిటీ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ చిన్నది.. ఆదర్శ కుటుంబంతో ఎలాంటి హిట్ ని అందుకుంటుందో చూడాలి. ఆదర్శ కుటుంబం సినిమాలో వెంకటేష్ సరసన మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది శ్రీనిధి శెట్టి. అయితే తాజాగా విడుదలైన పోస్టర్‌లో ఆమెను ఒక సాంప్రదాయబద్ధమైన మధ్యతరగతి గృహిణిగా చూపించడమే కాకుండా, ఆమెకు ఇద్దరు టీనేజ్ వయసున్న పిల్లలు కూడా ఉన్నట్లు చూపించారు. గ్లామరస్ రోల్స్‌తో ప్రేక్షకులను అలరించిన శ్రీనిధిని ఇలాంటి డీ-గ్లామరైజ్డ్ హౌస్‌వైఫ్ పాత్రలో, అదీ టీనేజ్ పిల్లల తల్లిగా చూపించడంతో ఆమె అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంత చిన్న వయసులోనే ఆమెతో ఇలాంటి మదర్ క్యారెక్టర్ చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు మేకర్స్‌పై తీవ్రంగా మండిపడుతున్నారు. నిజం చెప్పాలంటే శ్రీనిధి వయస్సు 33.. ఐశ్వర్య కంటే చిన్నది. అలాంటి ఆమె ఇద్దరు పిల్లల తల్లిగా ఎలా సెట్ అవుతోంది.. అది కూడా వెంకటేష్ భార్యగా.. అసలు గురూజీ ఇలాంటి క్యాస్టింగ్ ఎలా తీసుకున్నాడు అంటూ మండిపడుతున్నారు.



# అల్లు స్నేహా.. అందుకే వచ్చారా!

ఎప్పుడూ లేనిది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య అల్లు స్నేహా రెడ్డి మూవీ ఓపెనింగ్‌లో కనిపించి, అందరికీ షాక్ ఇచ్చారు. వాస్తవానికి అల్లు అర్జున్ సినిమాల ఓపెనింగ్ టైమ్‌లో కూడా అల్లు స్నేహా రెడ్డి కనిపించరు. కానీ, ఒక చిన్న సినిమా ఓపెనింగ్‌లో ఆమె కనిపించడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. అసలీ సినిమా టీమ్‌కు, ఆమెకు ఏమైనా బాండింగ్ ఉందా? అనేలా సెర్చ్ మొదలెట్టారు. వాస్తవానికి ఆమెకు ఈ సినిమా టీమ్‌తో ఏమీ బాండింగ్ లేదు. కానీ, ఈ సినిమా నిర్మాత అయినటువంటి సందీప్ రామినేని(శాండి) అల్లు అర్జున్‌కు స్నేహితుడు. ప్రస్తుతం అల్లు అర్జున్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో.. ఆ బాధ్యతని అల్లు స్నేహ తీసుకున్నారు. ఇక ఈ సినిమా ఓపెనింగ్ వివరాల్లోకి వెళితే.. మీరా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మౌర్య సిద్ధవరం, తన్వి ఆకాంక్ష హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'జోకర్'. ఈ సినిమా శనివారం లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా.. అల్లు స్నేహ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. యంగ్ ప్రొడ్యూసర్స్ బన్నీ వాస్, ఎస్‌కెఎన్ స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందించారు. ఈ సందర్భంగా నిర్మాత సందీప్ రామినేని మాట్లాడుతూ.. "మా బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.1 మూవీగా రాబోతోన్న ఈ సినిమా ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. డైరెక్టర్ గీత సి.శేఖర్ ఫన్ ఎంటర్‌టైనింగ్ కంటెంట్‌తో సినిమాను రూపొందిస్తూనే.. ఓ ఎమోషనల్ టచ్‌తో ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. మౌర్య, తన్వి జోడీ క్యూట్‌గా ఉంటుంది. ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించబోతున్నాం.




# ఏకే 47 విడుదల తేదీ ఖరారు

విక్టరీ వెంకటేష్ హీరోగా.. మాటల మాంత్రికుడు, సుప్రసిద్ధ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47' . 'ఏకే 47' అనేది ట్యాగ్‌లైన్. హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తోన్న ఈ చిత్ర విడుదల తేదీని శనివారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ మూవీ అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లుగా తెలుపుతూ.. అధికారికంగా మేకర్స్ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌ని గమనిస్తే.. తన ఫ్యామిలీతో వెంకీ చాలా హ్యాపీగా కనిపిస్తున్నారు. ఫ్యామిలీ మొత్తం ఎంజాయ్ మూడ్‌లో ఉన్నారు. వెంకీ సరసన 'కెజియఫ్', 'హిట్ 3' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ పోస్టర్‌లో ఆమె లుక్‌ని కూడా రివీల్ చేశారు. ఇందులో ఇద్దరు పిల్లలకు తల్లిగా ఆమె కనిపిస్తున్నట్లుగా ఈ పోస్టర్‌ని చూస్తుంటే తెలుస్తోంది. అలాగే ఈ పోస్టర్‌లో వెంకీ ఫ్యామిలీని రెండు డిఫరెంట్ ఫొటోలతో చూపించిన విధానం ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఫొటో ఒక వైపు, రిచ్ ఫ్యామిలీ మరోవైపు చూపిస్తూ.. మేకర్స్ వదిలిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

## Cinema



# నాగబంధం.. బాబోయ్ ఏంటీ క్రేజు?

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. సినిమా విడుదలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో, ఈ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రంపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకేలా మేకర్స్ ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై క్యూరియాసిటీని మరింతగా పెంచేసింది. ప్రస్తుతం సినిమాపై పాజిటివ్ బజ్ నడుస్తోంది. ఈ పాజిటివ్ వైబ్స్ సినిమా ప్రీ-రిలీజ్ బజ్‌ను భారీగా పెంచేయడంతో.. అన్ని ఏరియాల్లో ఈ సినిమా హాట్ కేకులా అమ్ముడవుతోంది. ఈ చిత్ర రైట్స్‌ని దక్కించుకునేందుకు అగ్ర డిస్ట్రిబ్యూటర్స్ లైన్‌లోకి రావడం చూస్తుంటే.. ఈ సినిమా సంచలన విజయాన్ని నమోదు చేయడం ఖాయమని అనిపిస్తోంది. విడుదలకు ముందే ఈ సినిమా భారీ స్థాయిలో థియేట్రికల్, నాన్-థియేట్రికల్ బిజినెస్ చేయడం.. డిస్ట్రిబ్యూటర్లకు ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న అగ్ర డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమా థియేట్రికల్ హక్కులను భారీ ధరలకు సొంతం చేసుకున్నారు.



# బడ్జెట్ దాటి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేను

భారీ స్టార్స్‌ను పెట్టి సినిమాలు తీసే క్రమంలో నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిపోతోందని, ఇది ప్రొడ్యూసర్లకు పెద్ద తలనొప్పిగా మారిందనే టాక్ ఇండస్ట్రీలో చాలా కాలంగా నడుస్తోంది. ఇదే వ్యవహారంపై స్టార్ ప్రొడ్యూసర్ దిల్‌రాజు ఒక తాజా పాడ్ క్యాస్ట్ వెల్లడించిన అభిప్రాయాలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చిత్రాల మార్కెట్ పరిధి, బిజినెస్ రేంజ్ గురించి తానే స్వయంగా హీరోలకు ముందే స్పష్టత ఇస్తానని, బడ్జెట్ పరిమితులను దాటి పారితోషికాలు ఇవ్వడం తన వల్ల కాదని, తన ఆలోచనలతో సింక్ అయ్యే హీరోలతోనే సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతానని దిల్‌రాజు కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేశాడు. తమకున్న క్రేజ్, మార్కెట్ వాల్యూ ఎక్కడ పడిపోతుందో అనే భయంతోనే చాలామంది స్టార్స్ తమ రెమ్యూనరేషన్స్ తగ్గించుకోవడానికి వెనుకాడుతుంటారని ఆయన ఈ సందర్భంగా తెలిపాడు. ప్రస్తుతం పరిశ్రమలో నడుస్తున్న ట్రెండ్ ప్రకారం.. ఒక రూ. 300 కోట్ల భారీ బడ్జెట్ చిత్రంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు భారీ మొత్తాన్ని కేవలం ఒక హీరో పారితోషికానికే కేటాయించాల్సి రావడం మేకర్స్‌కు పెద్ద తలనొప్పిగా మారిందని దిల్‌రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే ఆయన బాలీవుడ్ చిత్ర పరిశ్రమ అనుసరిస్తున్న సరికొత్త బిజినెస్ మోడల్‌ను ఉదాహరణగా చూపించాడు. హిందీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ముందస్తుగా పెద్ద మొత్తంలో క్యాష్ అడ్వాన్స్ రూపంలో తీసుకోవడం కంటే, సినిమా థియేట్రికల్, నాన్-థియేట్రికల్ రన్ ద్వారా వచ్చే నికర లాభాల్లో వాటా తీసుకునేందుకు అక్కడి స్టార్స్ ఆసక్తి చూపుతున్నారని, ఈ తరహా పద్ధతి వల్ల నిర్మాతలకు ఆర్థిక రిస్క్ చాలా వరకు తగ్గుతుందని, ఒకవేళ సినిమా బ్లాక్‌బస్టర్ విజయం సాధిస్తే హీరోలకు కూడా ఊహించని స్థాయిలో లాభాలు వస్తాయని, పొరపాటున ప్రాజెక్ట్ విఫలమైనా మేకర్స్ పూర్తిగా రోడ్డున పడే పరిస్థితి ఉండదని చెప్పుకొచ్చాడు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085